

1886 మే 3 చికాగో ఘటనలు: ఆనాటి త్యాగమూర్తులు

ISBN978-93-84162-03-0

ప్రజాశక్తి బుక్‌హౌస్



# నిరంతర పోరాట స్ఫూర్తి
# మేడే

# నిరంతర పోరాట స్ఫూర్తి **మేడే**

# నిరంతర పోరాట స్ఫూర్తి

# మేడే

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

*ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర*

*హైదరాబాద్-20. ఫోన్ : 040 - 27660013*

ISBN 978-93-84162-03-0

98033

ప్రచురణ సంఖ్య : 1031

ప్రథమ ముద్రణ : ఏప్రిల్, 2008

ద్వితీయ ముద్రణ : ఏప్రిల్, 2011

తృతీయ ముద్రణ : ఏప్రిల్, 2014

వెల : ₹. 15/-

ప్రతులకు

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర

హైదరాబాద్-20. ఫోన్ : 040 - 27660013

బ్రాంచీలు

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,

హన్మకొండ, నల్గొండ, గుంటూరు, ఒంగోలు, కరీంనగర్

ముద్రణ

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

website : www.psbh.in

శ్రామిక ప్రజల అంతర్జాతీయ సంఘీభావ దినోత్సవం మేడే. ప్రపంచ వ్యాపితంగా శ్రామిక ప్రజలు తమ హక్కుల కోసం పోరాటాలను ఉధృతం చేస్తూ, మొత్తంగా ఈ పెట్టుబడిదారీ వ్యవస్థనే అంతం చేసి శ్రమ దోపిడీ నుండి శాశ్వతంగా విముక్తి కావాలన్న తమ అంతిమ లక్ష్యాన్ని పునరుద్ఘాటించే రోజు ఇది. 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి!' అని ఆనాడు మార్క్స్, ఎంగెల్స్‌లు పిలుపు నిచ్చారు. ఆ పిలుపుకు అనుగుణంగానే దేశ దేశాల్లో కార్మిక వర్గ పోరాటాలు జరిగాయి. మహత్తర అక్టోబరు విప్లవం ఫలితంగా తొలి సోషలిస్టు సమాజం కూడ ఏర్పడింది. ఆ తర్వాత అనేక దేశాలలో సోషలిస్టు విప్లవాలు, జాతీయ విముక్తి పోరాటాలు విజయవంతం అయినాయి. కాని ఇటీవల కాలంలో సోషలిజానికి తీవ్రమైన ఎదురు దెబ్బలు తగిలాయి. నేడు ప్రపంచీకరణ పేరుతో సామ్రాజ్యవాదం తన దోపిడీని తీవ్రతరం చేసింది. కార్మికుల, ఇతర శ్రామికుల హక్కులపై ఉక్కుపాదాన్ని మోపుతున్నది. కార్మికులు తమ దేశంలో తాము హక్కుల కోసం పోరాటం చేయడమే కాకుండా, మొత్తం ప్రపంచ వ్యాపితంగా సమన్వయం చేసుకున్నప్పుడు మాత్రమే అవి విజయవంతం అయ్యే పరిస్థితి నేడు మన ముందున్నది. అందుచేతనే శ్రామిక వర్గ అంతర్జాతీయతకు ప్రాధాన్యత మరింత హెచ్చింది. ఈ నేపథ్యంలో మేడే ఆవిర్భావం గురించి తెలుసుకోవలసిన ఆవసరం కూడ ఎంతో ఉంది.

## పారిశ్రామిక విప్లవం

మానవజాతి చరిత్రలో 18వ శతాబ్దం అంతకు పూర్వం కంటే అత్యంత అభివృద్ధి చెందిన శతాబ్దంగా గణతికెక్కింది. ఆ శతాబ్దంలోనే ఇంగ్లాండ్ మరికొన్ని యూరోపియన్

దేశాల్లో ఉత్పత్తి రంగంలో ఆవిరి యంత్రాలను ప్రవేశపెట్టడం ద్వారా శీఘ్రంగా పారిశ్రామికీకరణ క్రమం ప్రారంభమయ్యింది. 1776 మార్చిలో వాట్‌సన్‌చే కనిపెట్టబడిన ఆవిరి యంత్రం ఇంగ్లాండ్‌లో ఒక బొగ్గుగనిలో మొదటిసారిగా ఉపయోగించబడింది. తరువాత ఈ క్రమం అమెరికాలో కూడా తలెత్తింది.

బ్రిటన్‌లో పారిశ్రామిక విప్లవంవల్ల 1820 నుండి 1844 నాటికి చేనేత కార్మికుల సంఖ్య 2,40,000 నుండి 60,000 కు తగ్గింది. (1960 నాటికి 8,000 మంది మాత్రమే వున్నారు) అదే కాలంలో మరమగ్గాల ఆపరేటర్లు 10,000 నుండి 15,000కు పెరిగారు.

యూరప్ ఖండంలోను, అమెరికాలోను 19వ శతాబ్దంలో సైన్సు, టెక్నాలజీ బాగా అభివృద్ధి చెందాయి. దానితో వేల సంఖ్యలో కార్మికులు పని చేసే భారీ పరిశ్రమలు తలెత్తాయి. రైల్వేలు, మోటారు కార్లు, టెలిఫోన్, టెలిగ్రాఫ్, విద్యుచ్ఛక్తి కూడా వాడుకలోకి వచ్చాయి.

ఆ శతాబ్దంలో జర్మనీ పారిశ్రామిక రంగంలో జరిగిన అభివృద్ధిని పరిశీలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. జర్మనీలో ఎస్సెన్ నగరంలోని క్రుప్స్ ఫ్యాక్టరీలోని (ఇనుము) కార్మికుల సంఖ్య 1845లో 122 మాత్రమే.కానీ 1985 నాటికి వారి సంఖ్య 45 వేలకు పెరిగింది.

ఫ్రాన్సులో ఉత్పత్తి రంగంలో 1839లో వాడుకలో ఉన్న ఆవిరి యంత్రాల సంఖ్య 2,540. ఈ సంఖ్య 1847 నాటికి 4583కి పెరిగింది. 1840 నాటికి 1832 కిలోమీటర్ల పొడవుగల రైలు మార్గాలు మాత్రమే నిర్మించబడ్డాయి. కాని 1860 నాటికి దాని పొడవు 9,439 కిలోమీటర్లకు పెరిగింది.

19వ శతాబ్దపు ప్రథమార్థ భాగం నాటికే యూరపు ఖండంలోను, అమెరికాలోను పరిశ్రమల్లో పని చేసే కార్మికుల సంఖ్య ఒక కోటికి పెరిగింది. దానితో ఉత్పత్తి రంగంలో పెట్టుబడిదారీ వర్గం, కార్మికవర్గం అనే రెండు ప్రత్యర్థి వర్గాలు తలెత్తాయి. ఈ వర్గాల మధ్య సంఘర్షణ అనివార్యం. పెట్టుబడిదార్లు శ్రామిక ప్రజల శ్రమశక్తిని క్రూరంగా దోచుకుంటూ వుంటారు. గనుక ఈ సంఘర్షణ తలెత్తింది. సమాజం నుండి దోపిడీదార్లను తుడిచిపెట్టే వరకూ ఈ వర్గపోరాటం నిరంతరం కొనసాగుతుంది.

## బానిస చాకిరి

పారిశ్రామిక విప్లవం ప్రారంభదినాల్లో శ్రామికులు బానిసలవలె శ్రమిస్తూ వుండేవారు. పారిశ్రామిక వేత్తలు అధిక లాభాలను పిండుకోవాలనే ఆశతో అత్యధిక సంఖ్యలో 6, 7 సంవత్సరాల వయస్సుగల పిల్లలచేత, మహిళల చేత ఫ్యాక్టరీలలోను, గనులలోను పని చేయిస్తూ వుండేవారు. బాల కార్మికులు గనులలో చీకటి సొరంగాలలో బొగ్గు బండను మోచేతులపైనా, మోకాళ్లపైనా పాకుతూ లాగేవారు. అంతేకాదు పొగగొట్టాలపైకి ఎక్కి వాటిని శుభ్రపరుస్తూ వుండేవారు.

ఇంగ్లాండ్‌లో అనాథ శరణాలయాల్లోని పిల్లలను శరణాలయాధికార్లు పారిశ్రామికవేత్తలకు పశువులను విక్రయించినట్లుగా విక్రయించేవారు. బాల కార్మికులు ఉదయం నుండి సాయంత్రం వరకూ యంత్రాల వద్ద నిలబడి పని చేసేవారు. క్షణం సేపు కన్నుమూస్తే ఆ పసికందుల వీపులు కొరడా దెబ్బలచే చిట్లగొట్టేవారు.

ఆనాడు శ్రమజీవులపై పని భారమేగాక పని గంటల భారం కూడా అధికంగా వుండేది. వారు రోజూ 16 గంటలు శ్రమించేవారు. దారుణమైన విషయమేమంటే కొంత మంది పెట్టుబడిదార్లు కార్మికులచే రోజూ 20 గంటలు కూడా పని చేయించేవారు.

1806లో ఫిలడెల్ఫియా (అమెరికా)లో చెప్పులు కుట్టే కార్మికులు సమ్మె చేశారు. కార్మికుల నాయకులపై విచారణ జరిగింది. ఆ సందర్భంగా యజమానులు కార్మికులచే రోజూ 19,20 గంటలు పని చేయించుకొంటూ వున్నారన్న విషయం వెల్లడయ్యింది.

పారిశ్రామికాధిపతులు శ్రమజీవులకు అతి తక్కువ జీతాలు ఇచ్చే వారు. ఆనాడు కార్మికులకు ఎట్టి భద్రతగాని, సౌకర్యాలుగాని వుండేవికాదు. ఫ్యాక్టరీల్లోగాలి, వెలుతురు మొదలైన సౌకర్యాలు మృగ్యం. కార్మికులకు యంత్రాల నుండి రక్షణ వుండేది కాదు. అందుచేత తరచుగా వారు ప్రమాదాలకు గురై మరణిస్తూ వుండేవారు.

కార్మికులు అమానుష శిక్షలకు కూడా గురవుతూ ఉండేవారు. వారు కదలినా, పాటలు పాడుకొన్నా, ఒళ్లు కడుక్కున్నా ఒకటి రెండు షిల్లింగులు జరిమానా కట్టవలసి వచ్చేది.

కార్మికులు తాము అనుభవించే పీడనకు, దోపిడీకి కారణం యంత్ర భూతాలని భ్రమించారు. దానితో రెచ్చిపోయారు. తెగించి యంత్రాలను ధ్వంసం చేయడం ప్రారంభించారు. ఈ విధ్వంసకాండ మొదట బ్రిటన్‌లో ప్రారంభమయ్యింది.

దాంతో పారిశ్రామికాధిపతులు ప్రభుత్వ సహాయం కొరకు పరిగెత్తారు. నికృష్టంగా దోపిడీకి గురవుతున్న కార్మికుల ప్రాణరక్షణకు చలించని ప్రభుత్వం వెంటనే యజమానుల ఆస్తి రక్షణకు పార్లమెంటును వుపయోగించింది. యంత్రాలను విచ్ఛిన్నం చేసే వారికి మరణశిక్ష విధిస్తూ చట్టం (1812లో) చేయబడింది.

కాని యంత్రాలను ధ్వంసం చేయడంలో అర్ధం లేదని, తమ బాధలకు, దుస్థితికి ఫ్యాక్టరీ యజమానులే కారణం అని కార్మికులు గ్రహించారు. తామీ దుస్థితి నుండి బయటపడటానికి సంఘటితంగా, దోపిడీమూకలకు వ్యతిరేకంగా పోరాటం సల్పడమొక్కటే ఏకైక మార్గమని అర్థం చేసుకొన్నారు. దాంతో బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా శ్రామిక వర్గం పోరాట పతాకాన్ని ఎగురవేసింది.

## కార్మిక సంఘాల నిర్మాణం

అణగదొక్కబడిన కార్మిక వర్గం తమ హక్కుల సాధనకొరకు కృతనిశ్చయంతో చైతన్యవంతంగా పోరాటాలు జరపడానికి వీలుగా కార్మిక సంఘాల నిర్మాణానికి పూనుకొంది. 1764-1800 సంవత్సరం మధ్య గ్రేట్ బ్రిటన్‌లో ట్రేడ్ యూనియన్‌ల నిర్మాణం జరిగింది. అటుతర్వాత యూరప్ ఖండంలో కార్మికవర్గం చైతన్యవంతంగా వున్న దేశాల్లో ట్రేడ్ యూనియన్‌ల నిర్మాణం ప్రారంభమయింది.

అమెరికాలో ఫిలడెల్ఫియా నగరంలో పోరాట సాంప్రదాయం గల కార్మికులు 1806లో "మెకానిక్స్ యూనియన్" పేరుతో కార్మిక సంఘాన్ని స్థాపించారు. అదే అమెరికాలోని మొట్టమొదట కార్మిక సంఘం. 1850, 60 నాటికే యూరప్ ఖండంలో పెక్కు దేశాల్లోని కార్మికులు, అమెరికాలోని కార్మికులు విప్లవోత్సాహంతో శక్తివంతమైన కార్మిక సంఘాలను నిర్మించుకొని తమ హక్కుల సాధన కొరకు క్రియాశీల పోరాటాలలోకి దూకారు.

ఆనాటికే యూరప్ ఖండంలోను, అమెరికాలోను వ్యాప్తిలో వున్న ఉటోపియన్ (ఊహాజనిత) సోషలిస్టు భావాలు, అటు తర్వాత శాస్త్రీయ సోషలిస్టు భావాలు. యూరప్ ఖండంలో అనేక దేశాల్లో భూస్వామ్య వ్యవస్థకు నిరంకుశ రాజరిక పాలనకు వ్యతిరేకంగా సామాన్య ప్రజలు జరిపిన విప్లవ పోరాటాల నుండి జనించిన ప్రగతిశీల భావాలు కార్మిక వర్గం సంఘటిత పడడానికి ఒకవిశిష్ట వర్గంగా అభివృద్ధి చెందడానికి దోహదం చేశాయి.

ట్రేడ్‌యూనియన్‌ల మహత్తర సామాజిక శక్తిని చూసి పాలకులు హడలెత్తిపోయారు. ఇంగ్లాండ్,ఫ్రాన్సు, జర్మనీ దేశాల్లో కార్మికులు అధిక జీతాలు డిమాండ్ చేయటం కోసం ట్రేడ్ యూనియన్లు నిర్మించుకోవడం చట్టవిరుద్ధంగా ప్రకటించారు. అలాంటి ట్రేడ్ యూనియన్‌లు నిషేధించబడ్డాయి.

దోపిడీమూకలు, వారికి కాపలా కాస్తూ వుండే పాలకులు పెక్కు మంది కార్మిక నాయకులను, ట్రేడ్ యూనియన్ సభ్యులను జైళ్లలో తోశారు. హత్యలు చేశారు. వారికి వున్న కొద్దిపాటి సొత్తును హరించారు. ట్రేడ్ యూనియన్లనే నిరంకుశంగా నిషేధించారు. సమ్మె చేసే హక్కును, పికెటింగ్ హక్కును లాగేశారు. అయినా ట్రేడ్ యూనియన్ ఉద్యమం అంతరించలేదు. తమ జీవన పరిస్థితులను బాగుపరచుకొనేందుకు కార్మికులకు గల మహత్తర ఆయుధం అది. దానిని ఎవరూ విచ్ఛిన్నం చేయలేరు.

## సమ్మె పోరాటాలు

బూర్జువా పాలకులు ట్రేడ్ యూనియన్లను నిషేధించినా, పశుబలంతో కార్మికవర్గ పోరాటాలను రక్తపుటేరుల్లో ముంచినా, కార్మికవర్గం వెనుకంజ వేయలేదు. పని గంటల తగ్గింపు కోసం, న్యాయమైన వేతనాల కోసం, ట్రేడ్ యూనియన్ల గుర్తింపు కోసం ప్రభుత్వపరంగా హక్కుల కొరకు కార్మికవర్గం చైతన్యంతో పోరాటాలను కొనసాగించింది. ఈ పోరాట జ్వాలలు 19వ శతాబ్దం ప్రథమార్థభాగంలో బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, అమెరికా దేశాల్లోని దోపిడీ శక్తులను చుట్టుముట్టాయి.

ఇంగ్లాండులో 1818లో స్టాక్‌పోర్టు పట్టణంలోని బట్టల ఫ్యాక్టరీల్లో పని చేసే కార్మికులు సమ్మె బావుటాను ఎగురేశారు. ఈ సమ్మె పోరాటం ప్రపంచ కార్మికవర్గ చరిత్రలో ప్రథమ సమ్మె పోరాటంగా లెక్కించబడింది.

ఫ్రాన్స్‌లో సిల్కు పరిశ్రమలకు ప్రసిద్ధికెక్కిన 'లయాన్సు' పట్టణంలో 1831లోను, 1834లోను కార్మికులు తిరుగుబాటు జరిపారు. ప్యారిస్ నగరంలో 1848 జూన్ 23-26 మధ్య సమ్మె పోరాటాలు జరిగాయి.

1844లో సైలీషియా (జర్మనీ)లోని నేత పనివారు జరిపిన తిరుగుబాటువల్ల శ్రామికవర్గం యొక్క నిర్మాణాత్మకమైన పటిమ, బూర్జువావర్గంలో దానికిగల శత్రుత్వం స్పష్టంగా వెల్లడయ్యింది.

నైరుతీ జర్మనీలో విప్లవోద్యం 1848 మార్చిలో రగులుకొంది. కోలోన్ వంటి పారిశ్రామిక కేంద్రాల్లోని శ్రామికులు బాగా చైతన్యంగల వారు కావటంవల్ల తమ కోర్కెలతో ముందుకొచ్చారు. మార్చి 13న వియన్నా (ఆస్ట్రియా)లో తిరుగుబాటు వచ్చింది. కార్మికులు విజయం సాధించారు. అదే రోజున బెర్లిన్‌లో కార్మికులకు, సైనికులకు మధ్య సంఘర్షణలు జరిగాయి. బారికేడ్లు నిర్మించబడ్డాయి. చివరికి శ్రామికులు మార్చి 18న విజయం పొందారు.

జర్మన్ కార్మికవర్గం సాధించిన విజయాలు శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతాన్ని తొలిసారిగా ప్రవచించిన కారల్ మార్క్సును, ఫెడరిక్ ఏంగెల్స్‌ను ఎంతగానో ఉత్తేజపరిచారు.

"స్వాభావికంగా ధనికవర్గం చేత వెనక్కి నెట్టబడుతూ వుండే శ్రామిక వర్గం ముందుకు వురికింది. తన శక్తిని గుర్తించి,పోరాడి, విజయం సాధించింది"

**- ఎంగెల్స్ "రివల్యూషన్ అండ్ కౌంటర్ - రివల్యూషన్"**

"ఈ ప్రజాతంత్ర విప్లవంలో కలిగిన అనుభవాలవల్లనే శ్రామికవర్గానికి ప్రత్యేక నిర్మాణమూ, ప్రత్యేక పార్టీ వుండాలనే నిర్ణయానికి మార్క్సు వచ్చాడు." అని లెనిన్ కొలోన్ కార్మిక పోరాటంపై వ్యాఖ్యానించారు.

ఈ కాలంలోనే అమెరికాలో పెక్కు నగరాల్లో కార్మికులు తమ హక్కుల సాధన కోసం పోరాటాలు నిర్వహించారు.

యూరప్ ఖండంలోను, అమెరికాలోను కార్మికవర్గం బలమైన పోరాటాలు జరపటంవల్లనే ప్రభుత్వాలు దిగొచ్చి కార్మిక వర్గానికి అనుకూలంగా కొన్ని చట్టాలు చేశాయి. వాటిలో ముఖ్యమైనవి పని గంటలకు, బాల కార్మికులకు సంబంధించినవి.

బ్రిటన్‌లో 13 సంవత్సరాల లోపుపిల్లలచే రోజుకి 9 గంటలకు మించి పని చేయించ రాదని 1834లో ఒక ఫ్యాక్టరీ చట్టం చేయబడింది. శ్రామిక ప్రజలు జరిపిన పోరాటాల ఫలితంగా కొన్ని చట్టాలు చేయబడినప్పటికీ అధికారులు మాత్రం వాటిని చిత్తశుద్ధితో అమలు జరపడం మాత్రం జరగలేదు.

ఒక సంవత్సరం తర్వాత మరొక సంవత్సరం ఫ్యాక్టరీల నిర్మాణం త్వరితంగాను, విస్తృతంగానుపెరగడంతో ఫ్యాక్టరీలు, గనులు, రవాణా రంగాలలో పనిచేసే కార్మికుల సంఖ్య లక్షల సంఖ్యలో పెరిగింది. కార్మికులలో వర్గ చైతన్యం వెల్లివిరిసింది. బలోపేతమైన

ట్రేడ్ యూనియన్‌ల నిర్మాణం జరిగింది. కార్మికవర్గ పోరాటాలు బూర్జువా వర్గాన్ని చుట్టుముట్టాయి. దానితో కార్మికవర్గం గొప్ప సంఘటిత శక్తిగాను, విప్లవ స్వభావం గల వర్గంగాను అభివృద్ధి చెందింది.

## 10 గంటల పని దినం ఉద్యమం

10 గంటల పని దినం నిర్ణయించాలన్న కోర్కె మీద 19వ శతాబ్దం ప్రారంభంలో అమెరికాలో ప్రతి పారిశ్రామిక కేంద్రంలోనూ సమ్మెలు చెలరేగాయి. ఫిలడెల్ఫియాలోని మెకానిక్స్ యూనియన్ ఈ 10 గంటల పని దినం పోరాటాన్ని తట్టుకోలేక అమెరికన్ ప్రభుత్వం 1837లో 10 గంటల పనిదినం నిర్ణయిస్తూ శాసనం చేసింది. తర్వాత ఈ 10 గంటల పని దినం ఉద్యమం అట్లాంటిక్ మహా సముద్రం దాటి యూరప్ ఖండంలో ప్రవేశించి అచ్చటి కార్మికవర్గాన్ని ఉత్తేజపరిచింది. యూరప్ ఖండంలో కార్మికులు జరిపిన పోరాటాల ఫలితంగా అనేక దేశాలు 10 గంటలు పని దినం అంగీకరిస్తూ చట్టాలు చేశాయి.

## 8 గంటల పని దినం

1870 నాటికే పారిశ్రామిక, వాణిజ్య, బ్యాంకింగ్ రంగాల్లో గుత్తాధిపత్యం రూపుదాల్చి బలపడింది. పెట్టుబడిదారీ వర్గం కొన్ని ఒడుదుడుకులకు గురయినప్పటికీ అధిక లాభాలు పోగు చేసుకోవడానికి ఆ వర్గానికి మంచి అవకాశాలు ఏర్పడ్డాయి. కాని కార్మికవర్గం జీవితాల్లో అభివృద్ధి మాత్రం మృగ్యం. దానితో కార్మిక వర్గం పని గంటల తగ్గింపుకోసం ఉద్యమించింది.

1881 చికాగో నగరంలో వివిధ కార్మిక సంఘాలు కలిసి ఒక సమాఖ్యను నూతనంగా ఏర్పాటు చేసుకున్నవి. దానికి "అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్" అని పేరు పెట్టబడింది.

1884 అక్టోబరు 7వ తేదీన ఈ సమాఖ్య 4వ సమావేశంలో 8 గంటల పని దినం కోసం చారిత్రాత్మకమైన తీర్మానం చేయబడింది. 1886 మే మొదటి తేదీన దేశమంతటా కార్మిక వర్గం ఈ హక్కును సాధించుట కోసం సమ్మె పోరాటాలను నిర్వహించాలని కూడా నిర్ణయించబడింది. ఫెడరేషన్ ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడానికి అమెరికాలో ఆనాటి భౌతిక పరిస్థితులు కూడా చాలా తోడ్పడ్డాయి. 1880-90 మధ్య కాలంలో అమెరికాలో పరిశ్రమలు బాగా అభివృద్ధి చెందాయి.

1884-85 మధ్య తిరిగి మరొక ఆర్థిక సంక్షోభం రావటంతో అనేక మంది కార్మికులు నిరుద్యోగానికి గురయ్యారు. పనిలోగల కార్మికుల స్థితిగతులు కూడా అతి దుర్భరంగా తయారయ్యాయి. 8 గంటల పని దినం ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవలసిన అవసరాన్ని కార్మికవర్గం అత్యంత ముఖ్యమైన డిమాండుగా గుర్తించింది. ట్రేడ్ యూనియన్‌ల సభ్యత్వం లక్షల సంఖ్యలో పెరిగింది.

అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్ యొక్క పలుకుబడి కార్మిక వర్గంలో విపరీతంగా పెరిగిపోయింది. ఎక్కడ చూసినా కార్మికులు అతిపట్టుదలతో సమ్మె పోరాటానికి సిద్ధమయ్యారు.

మేడే సమ్మె సన్నద్ధంగా 1885-86లో జరిగిన సమ్మె పోరాటాల్లో లక్షలాది కార్మికులు పాల్గొనటమే ఇందుకు ప్రత్యక్ష తార్కాణం.

మొదటి ఇంటర్నేషనల్ మహాసభ జనీవాలో 1866 సెప్టెంబరులో జరిగింది. ఆ మహాసభ కూడా రోజుకి 8 గంటల పనిని చట్టబద్దం చేయాలని కోరుతూ ఈ క్రింది తీర్మానం చేసింది.

"పని దినానికి న్యాయపరమైన పరిమితి ప్రాథమిక షరతు. అది లేకుండా కార్మికవర్గానికి యితర ప్రయోజనాలు కల్పించే ప్రయత్నాలు వ్యర్థం. పని దినానికి 8 గంటలు న్యాయపరమైన పరిమితిగా కాంగ్రెస్ ప్రతిపాదిస్తూ వున్నది.

## 8 గంటల పని ఉద్యమంపై కారల్ మార్క్స్

1867లో ప్రచురితమైన "కాపిటల్" ప్రథమ సంపుటంలో పని దినం అన్న అధ్యాయంలో 8 గంటల పనిని గురించి కారల్ మార్క్స్ ఇలా ప్రస్తావించారు.

"అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో బానిసత్వం ప్రబలంగా వున్నంత కాలం స్వతంత్ర కార్మికోద్యమం స్తంభిస్తూనే వచ్చింది. నల్లతోలున్న కార్మికుల్ని అణగదొక్కుతున్న చోట తెల్లతోలున్న కార్మికులు తమకు తాముగా విముక్తి పొందజాలరు. బానిసత్వం అంతం కావడంతో నవనవోన్మేషనమైన జీవితం ఆవిర్భవించింది. అంతర్యుద్ధం ఫలితంగా రోజుకు 8 గంటల పని అన్న ఆందోళన బయలుదేరింది. ఈ ఉద్యమం అట్లాంటిక్ నుంచి పసిఫిక్ వరకు, న్యూ ఇంగ్లాండ్ (అమెరికా తూర్పు దిక్కు) నుంచి కాలిఫోర్నియా (అమెరికా పశ్చిమ దిక్కు) వరకూ ఉరకలు వేసుకుంటూ వ్యాపించింది"

ఈ విధంగా 8 గంటల పని కోసం అనేకచోట్ల కార్మిక పోరాటాలు ప్రారంభ మయ్యాయి.

## చారిత్రాత్మకమైన మేడే

చికాగో కార్మికవర్గం అమెరికన్ కార్మిక వర్గంలో ఒక భాగమే అయినా అక్కడి కార్మిక వర్గానికి ఒక ప్రత్యేకత వుంది. సమస్యల పరిష్కారానికి వారు పటిష్టమైన విప్లవ దృక్పథం అవలంబించే వారు. ఆ నగరంలోని కార్మిక నాయకులు కూడా ఎప్పుడూ కార్మికవర్గాన్ని విప్లవ మార్గాన నడిపిస్తూ వుండేవారు. అందుచేతనే చికాగోలో మే ఒకటో తేదీన సమ్మె తీవ్రరూపం దాల్చింది.

సమ్మెకు అనేక రోజుల పూర్వమే "8 గంటల పని దినం సంఘం" ఒకటి అనేక రాజకీయ దృక్పథాలు గల వారితో ఏర్పడి పని చేయసాగింది. ఆ సంఘం నాయకత్వంలో మే 1వ తేదీకి ఒక రోజు ముందు ఆదివారంనాడు 25 వేల మంది కార్మికులతో బ్రహ్మాండమైన ప్రదర్శన జరిగింది. మే ఒకటిన చికాగో నగరంలో వెల్లివిరిసిన కార్మిక చైతన్యానికి అంతులేదు. నగర వీధులన్నీ ఉత్సాహవంతులైన కార్మికులతో నిండిపోయాయి. నగరంలో బ్రహ్మాండమైన సార్వత్రిక సమ్మె జరిగింది. కర్మాగారాలన్నీ మూతబడ్డాయి. అదివరకెన్నడూ కనీవినీ ఎరుగనంతటి ఐక్యమత్యంతో మూడున్నర లక్షల మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. నగర వీధులన్నీ కార్మిక సందోహంతో నిండిపోయాయి. 8 గంటల పని దినాన్ని సాధించి తీరుతాం, అనే దృఢ విశ్వాసం వారందరిలోనూ కొట్టవచ్చినట్లు కనిపించింది. సమ్మెను విజయవంతం చేయటానికి వారు తమ సర్వశక్తులను ఒడ్డడానికి సిద్ధపడ్డారు. కార్మికవర్గ శత్రువులు కూడా విజృంభిస్తున్న ఈ కార్మికోద్యమాన్ని ఏ విధంగానైనా నాశనం చేయాలని నిర్ణయించుకున్నారు. పెట్టుబడిదారీ వర్గానికి అండగా ప్రభుత్వం కూడా రంగప్రవేశం చేసింది.

మే 3వ తేదీన కార్మికులు రక్తాన్ని కండ్ల చూడటానికి అమెరికన్ పోలీసులు నిర్ణయించు కున్నారు. ఆ రోజున శాంతియుతంగా సమ్మె సాగిస్తూ వున్న కార్మిక జనసమూహంపై పోలీసులు కాల్పులు జరిపి ఆరుగురు ప్రాణాలను బలిగొన్నారు.

ఈ దారుణ హత్యాకాండవల్ల అసమ్మతి తెలిపేందుకు 4వ తేదీన నగరం మధ్యలో వున్న హే మార్కెట్‌లో కార్మికులు పెద్ద నిరసన సభ జరిపారు. ప్రశాంతంగా జరుగుతూ

ఉన్న ఆ సభ మీద పోలీసులు విరుచుకుపడ్డారు. మధ్యలో ఒక బాంబు ప్రయోగం జరిగింది. ఒక పోలీసు సార్జెంట్ చనిపోయాడు. అది సాకుగా తీసుకొని పోలీసులు నిరాయుధులైన ప్రజలపై తుపాకులతో, సన్నీలతోస్వైర విహారం చేశారు. అయినప్పటికీ నిరాయుధులైన కార్మికులు సంఘటితంగా చైతన్యదీప్తితో పోలీసులతో బాహాబాహిగా తలపడ్డారు. ఆ సంఘర్షణలో ఏడుగురు పోలీసులూ, నలుగురు కార్మికులూ నేల కొరిగారు. పాలకవర్గం అదనపు బలగాలను రంగంలోకి దించింది. హే మార్కెట్ ప్రాంతం కార్మికుల రక్తంతో తడిసిపోయింది. అక్కడే ఆవిర్భవించింది. ప్రపంచ వ్యాపితంగా వున్న కోట్లాది శ్రమజీవుల స్వేచ్ఛా సంకేతం అయిన "అరుణ పతాకం."

ఈ మార్కెట్ ఉదంతాన్ని పురస్కరించుకొని బూర్జువా ప్రభుత్వం కార్మికోద్యమ నాయకులను చుట్టివేసే కార్యక్రమం ప్రారంభించింది.

న్యాయస్థానం ముందు విచారణ తరంగం జరిపి పార్సన్, స్పిన్, ఫిషర్, ఏంగెల్స్ అనే కార్మిక నాయకుల్ని ఉరి తీయించింది. మరికొందరిని దీర్ఘకారాగారవాస శిక్షలకు గురి చేసింది.

ఆ సమ్మెకు నాయకత్వం వహించిన ఐదుగురు విప్లవ మూర్తులతో ఒకరైన "స్పిన్" తనను ఉరితీసే ముందు ఉరికంబం నుండి యిలా గర్జించాడు.

"మమ్మల్ని ఉరితీస్తే మంటలు ఆరిపోతాయనుకుంటున్నారా? అదిగో అక్కడ, యిక్కడ, ఆమూల, ఈమూల, మీ వెనుక, మీ ముందు అన్ని చోట్లా జ్వాలలు చెలరేగుతాయి. అది అంతర్వాహిని. దాన్ని ఆర్పడం మీ తరం కాదు."

దేశమంతటా ఇతర కేంద్రాలలో కూడా ఈ దమనకాండ కొనసాగింది. అయినప్పటికీ అమెరికన్ కార్మికులలో మాత్రం మే ఒకటిన విప్లవ చైతన్యం వెల్లివిరిసింది. ప్రతి కార్మికుడూ తన వర్గ చైతన్యాన్ని ప్రదర్శించటానికి వీధుల్లోకి వచ్చారు. ఆ విధంగా 1886 మే మొదటి తేదీ ప్రపంచ కార్మికవర్గ విప్లవ చరిత్రలో రక్తాక్షరాలతో లిఖించదగిన తేదీగా మారిపోయింది. ఆనాటి పోరాటోద్యమానికి చికాగో నగరమే కేంద్రం అయినప్పటికీ దేశంలోని అనేక ముఖ్య నగరాలకు ఆ ఉద్యమం వ్యాపించింది.

న్యూయార్క్, బాల్టిమోర్, వాషింగ్టన్, పిట్స్‌బర్గ్, డిట్రాయట్ మొదలైన పెద్ద నగరాల్లోని శ్రామికులు కూడా మహోత్తేజంగా పోరాటంలోకి దూకారు.

అమెరికన్ కార్మికుల త్యాగం వృధా కాలేదు. అభివృద్ధి అవుతున్న ఐరోపా కార్మికోద్యమం వారితో చేతులు కలపాలని నిర్ణయించుకుంది. 1889లో పారిస్‌లో జరిగిన సోషలిస్టు ఇంటర్నేషనల్ మొదటి కాంగ్రెస్ మేడే జరపడాన్ని అంతర్జాతీయంగా రూపొందించాలని తీర్మానించింది.

## సోషలిస్టు అంతర్జాతీయ సంస్థ

సోషలిస్టు అంతర్జాతీయ సంస్థ మొదటి కాంగ్రెస్ ఒక సాధారణ ఘటన కాదు. మొదటి అంతర్జాతీయ సంస్థ రద్దు ఆయన తరువాత, కార్మికవర్గ ఉద్యమానికి ఒక అంతర్జాతీయ కేంద్రం కరువైంది. అయితే మార్క్సు ఏంగెల్స్‌ల భావాలు కార్మికవర్గ ఉద్యమానికి మార్గదర్శకత్వం వహించసాగాయి. రాజకీయ చైతన్యం, నిర్మాణాలలో ఒక నూతన వెల్లువ ఏర్పడసాగింది.

ఉద్యమానికి మార్గదర్శకత్వం వహించారు. సజీవుడైన ఏంగెల్స్. ఈ కాలంలోనే సరైన మార్క్సిస్టు కార్యక్రమం ప్రాతిపదికగా కార్మికవర్గ సోషలిస్టు పార్టీలు ఆవిర్భవించసాగాయి. ఈ పార్టీలు నూతన సోషలిస్టు అంతర్జాతీయ సంస్థను ఏర్పర్చేందుకు పారిస్‌లో సమావేశమయ్యాయి. ఇదే రెండవ అంతర్జాతీయ సంస్థగా ప్రఖ్యాతి చెందింది. మొదటి సమావేశానికి ఏంగెల్స్ హాజరయ్యారు. ఈ పార్టీలకన్నింటికి ఆయన ఇంత వరకు మార్గదర్శకులుగా వుండేవారు. ఈ పార్టీలకన్నింటికీ ఆయన ఇంతవరకు మార్గదర్శకులుగా వుండేవారు. నూతన అంతర్జాతీయ కార్మిక సంస్థకు సరైన, రాజకీయ, నిర్మాణ మార్గదర్శకత్వం సమకూర్చారు ఆయన.

మొదటి కాంగ్రెస్‌లో సమావేశమైన పార్టీలు, నాయకులంతా మార్క్సిస్టు బోధలతో ప్రభావితులయ్యారు. మేడేని అంతర్జాతీయం చేయాలని నిర్ణయించడంలో ఆనాటి ప్రత్యేక పరిస్థితులకు మార్క్సిస్టు అవగాహనను అన్వయించారు వారు. అందువల్లనే రక్షణ ఆర్థిక కోర్కెలను మాత్రమే ప్రకటించి ఊరు కొనలేకపోయారు వారు. ఈ పాక్షిక కోర్కెలను పెట్టుబడిదారీ విధానాన్ని అంతం చేయాలనే అంతిమ లక్ష్యంతో జత చేశారు.

## పాక్షిక డిమాండ్ల సాధనకు కార్యక్రమం

అంతకు ముందు ఏర్పడిన మొదటి అంతర్జాతీయ సంస్థలాగే, పారిస్ కాంగ్రెస్ సహితం తక్షణ డిమాండ్ల కోసం ఒక సంపూర్ణ కార్యక్రమానికి పిలుపు నిచ్చింది. అయితే

ఆనాడున్న పరిస్థితులలో ఆ పిలుపు తీవ్రమైన వర్గపోరాటాలకు దారి తీస్తుంది. కార్మికవర్గంలో వర్గచైతన్యం పెరిగేందుకు దోహదం చేసింది. చట్టం ద్వారా ఎనిమిది గంటల పనిని నిర్ణయించాలి, 2) బాల శ్రమను నిషేధించాలి, 3) యువ, మహిళా శ్రమపై పరిమితులు విధించాలి, 4) రాత్రిపనికి ప్రత్యేక నిబంధన, ప్రమాదకరమైన పనులకు ప్రత్యేక నిబంధన, 5) చట్టబద్ధమైన వారాంతపు విశ్రాంతి, ఫ్యాక్టరీ నడిపేషాపుల ద్వారా అమ్మకాలు లేదా వస్తురూపమైన ప్రతిఫలం నిషేధించాలి. ప్రభుత్వమే ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లను నియమించాలి. జాతితో సంబంధం లేకుండా స్త్రీ పురుషులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. "ఎలాంటి అవధులు లేకుండా యూనియన్లు సమిష్టి సంఘాలు ఏర్పర్చుకునే స్వేచ్ఛ వుండాలి" ఇవీ ఆనాడు తక్షణ కోర్కెలుగా రూపొందించిన కోర్కెలు.

ఆనాడున్న అతిహీనమైన జీవన పరిస్థితులకు ఈ డిమాండ్లు అద్దం పడుతున్నాయి. పెట్టుబడిదారీ వర్గం అవధులు లేకుండా సాగించిన దోపిడీ స్వభావాన్ని నగ్నంగా బయటపెడుతున్నాయి. అటువంటి పరిస్థితిలో ఈ డిమాండ్ల సాధనకు, చట్టబద్ధమైన పని కోసం సాగే అంతర్జాతీయ స్థాయిలో సమిష్టి పోరాటం విప్లవకర ఫలితాలకు తప్పక దారి తీస్తుంది.

తన జెనీవా, బ్రస్సెల్స్ కాంగ్రెస్‌లలో మొదటి అంతర్జాతీయ సంస్థ సహితం పాక్షిక కోర్కెల సాధనకు ఇలాంటి కార్యక్రమాన్నే విశదంగా ప్రకటించింది. మరొకసారి పారిస్ కాంగ్రెస్ క్రమబద్ధంగా కార్మికవర్గ తక్షణ డిమాండ్లను ముందుకు తెచ్చి అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమం ముందు ఒక పద్ధతి ప్రకారం ప్రవేశపెట్టింది. "పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం కొనసాగే దేశాలన్నింటా" ఈ డిమాండ్ల సాధన "సంపూర్ణంగా అనివార్యం" అని కూడా సృష్టీకరించారు. "ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ వినాశకర ప్రభావాన్ని ఎదిరించేందుకు" ఇది అనివార్యమని కూడా పేర్కొన్నారు.

## రాజకీయ పోరాటం

అయితే పాక్షిక కోర్కెల కార్యక్రమం ప్రకటించడంతో కాంగ్రెస్ సరిపుచ్చుకోలేదు. అంతర్జాతీయ పరిరక్షణపై చేసిన తీర్మానంలో 'అంతర్జాతీయ స్థాయిలో ఒక వర్గంగా నిర్మాణయుతమైన కార్మిక వర్గం మాత్రమే కార్మికులను, మొత్తం మానవ జాతిని విముక్తి చేయగలరు. పెట్టుబడిని స్వాధీనం చేసుకునేందుకు, ఉత్పత్తి సాధనాలను ప్రజల ఆస్తిగా

మార్చేందుకు నిర్మాణయుత కార్మికవర్గం రాజకీయాధికారాన్ని స్వాధీనం చేసుకోవాలి" అని కూడా స్పష్టం చేసింది. ఇది కార్మిక వర్గ తక్షణ కోర్కెలను, ఆ వర్గపు చరమ లక్ష్యమైన సోషలిజంతో ముడిపెట్టింది.

పారిస్ కాంగ్రెస్ సమావేశమయ్యేసరికి యూరోప్‌లో సైనిక తత్వము, యుద్ధ ప్రమాదం హెచ్చుతున్నది. సోషలిస్టు పార్టీల నాయకులు, అందరినీ మించి ఏంగెల్స్ యుద్ధ వ్యతిరేకంగా కార్మికవర్గ కార్యాచరణ విధానాన్ని రూపొందించడంలో తలమునకలై ఉన్నారు. అందువల్లనే పారిస్ కాంగ్రెస్ సైన్యాలరద్దు చేయాలని, ప్రజలందరినీ సాయుధులను చేయాలనికోరుతూ తీర్మానించింది. యుద్ధానికి పెట్టుబడిదారీ విధానానికీ మధ్యగల ప్రత్యక్ష అంతఃసంబంధాన్ని ఈ తీర్మానం బట్టబయలు చేసింది. ప్రపంచ వ్యాప్తంగా సోషలిజం విజయం సాధించడమే,యుద్ధం లేని ప్రపంచానికి గ్యారంటీ అని పేర్కొంది.

## మేడేని అంతర్జాతీయకరించడం

ఈ పూర్వరంగంలోనే మేడే నిర్వహణను అంతర్జాతీయం చేస్తూ పారిస్ కాంగ్రెస్ తీర్మానం చేసింది. "పారిస్ కాంగ్రెస్ చేసిన ఇతర తీర్మానాలను అమలు జరపాలని చట్టబద్ధంగా పని దినాన్ని ఎనిమిది గంటలకు తగ్గించాలని ప్రభుత్వాలను, ఒకానొక నిర్దిష్టమైన రోజు అన్ని దేశాల్లోను, అన్ని నగరాలలోను ఒక మహత్తర అంతర్జాతీయ ప్రదర్శనలను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నిర్ణయిస్తున్నది. అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్ సెయింట్ లూయిస్‌లో 1883 డిసెంబరులో 1890 మేడే న అలాంటి ప్రదర్శనలే జరపాలని తీర్మానించి వున్నందున ఆ దినమే అంతర్జాతీయ ప్రదర్శనల దినంగా వుండాలని అంగీకరించడమైంది. ఆయా దేశాలలో గల పరిస్థితులను అనుసరించి వివిధ దేశాల కార్మికులు ఈ ప్రదర్శనలు జరపాలి" అని ఆ తీర్మానం పేర్కొంది.

1891లో బ్రస్సెల్‌లో ఆ తరువాతి కాంగ్రెస్ జరిగింది. మేడేని ఎనిమిది గంటల పని దినం, దేశాల మధ్య శాంతినికోరుతూ ప్రదర్శనలు జరపాలని కోరింది. శాంతి పరిరక్షణ అనే అంశాన్ని చేర్చడం చాలా ప్రాధాన్యతగల అంశం. శాంతి లేకుండా అంతర్జాతీయతా సౌహార్దత తన అర్థాన్నే కోల్పోతుంది. కారల్ మార్క్స్ నేతృత్వంలో మొదటి అంతర్జాతీయ సంస్థ (1870) ఫ్రెంచి – జర్మనీ యుద్ధ సందర్భంగా శాంతిని పరిరక్షించి, తమ సౌహర్దతను కొనసాగించవలసిందిగా తన ప్రణాళికలోనే కోరింది. ఉద్విగ్నభరితమైన ఈ పిలుపు ఆధారంగానే రెండు దేశాల పాలకులు యుద్ధంలో మునిగి తేలుతుండగానే

ఫ్రెంచి కార్మికులు, జర్మన్ కార్మికులకు తమ అభినందనలు పంపారు. మేడే నాడు యుద్ధాన్ని వ్యతిరేకించమని, జాతుల మధ్య శాంతిని కాపాడమని రెండవ ఇంటర్నేషనల్ ఇచ్చిన పిలుపు మొదటి అంతర్జాతీయ సంస్థ ఏర్పర్చిన అంతర్జాతీయ సాంప్రదాయమే.

## మొదటి మేడే జరిగిన తీరు

కార్మికవర్గ కార్యకలాపాలు అధికమయ్యాయి. దాని అంతర్జాతీయ చైతన్యం పెరిగింది. వాటి ఫలితంగానే పారిస్ కాంగ్రెస్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముందు ఐరోపా అన్ని దేశాలలో పెద్ద సంఖ్యలో సమ్మె పోరాటాలు సాగాయి. ఎన్నికల పార్లమెంటరీ రంగాలలో కార్మికవర్గం ఎన్నో సాధించింది. అందువల్లనే పారిస్ కాంగ్రెస్ యిచ్చిన పిలుపుతో ఐరోపా, అమెరికాలలో ఎన్నడూలేని వుత్సాహానికి, సామూహికస్పందనకు దారితీయడంలో ఆశ్చర్యం లేదు. 1890 మేడే నాడు ఐరోపా అంతటా పారిశ్రామిక నగరాలలో లక్షలాది కార్మికులు వీధులు నిండిపోయారు. జర్మనీ, ఫ్రాన్సు, డెన్మార్క్‌లలో కొన్ని నగరాలలో అనేక ఫ్యాక్టరీలలో సమ్మె చేసి అంతర్జాతీయ దినం జరిపారు. అనేక నగరాలలో సామూహిక ప్రదర్శనలు జరిగాయి. వియన్నా ప్రదర్శనలో లక్ష మంది పాల్గొన్నారు. బుడాపెస్ట్‌లో 60, మార్సెల్స్‌లో 40, 50 వేల మంది, ప్రేగ్‌లో 35 వేలు కొబాక్స్ 20, 30 వేల మంది పాల్గొన్నారు. లాల్లే, స్టాక్‌హోం, చికాగో వంటి నగరాలలో వేలాది మంది పాల్గొన్నారు. 20 వేల మంది వార్సా కార్మికులు, లివివ్‌లో 3 వేల మంది ప్రదర్శన జరిపారు.

స్పెయిన్, బ్రిటన్‌లలో మే నెల మొదటి శనివారం, 4వ తేదీని అంతర్జాతీయ సౌహార్దత ప్రదర్శించారు. బార్సెలోనాలో లక్ష మంది ప్రదర్శన జరిపారు.

## మేడే పై ఏంగెల్స్

మొదటి మేడే ప్రదర్శనకు లండన్ కార్మికులుసాగించే ఏర్పాట్లన్నింటిలో ఏంగెల్స్ పాల్గొన్నాడు. కార్మికులపై సంస్కరణవాద ట్రేడ్ యూనియన్ నాయకుల ప్రభావం వున్నా, పరిస్థితులు ఎంతో అనుకూలంగా వున్నాయి. ఎలినార్ మార్క్స్, డాక్టర్ ఎడాల్ఫ్, ఆవెలింగ్, లీడర్ టామ్‌మెన్, జాన్ బర్న్సు వంటి నాయకులు గ్యాస్, బొగ్గు వంటి నిపుణులు కాని కార్మికులను సహితం ఈ మహోద్యమంలోనికి తెచ్చేందుకు కృతనిశ్చయంతో కృషి చేశారు. దీంతో 1880 మొదట్లో ఇంగ్లీషు కార్మికవర్గంలో, ముఖ్యంగా లండన్ కార్మిక వర్గ

ఉద్యమంలో నూతన వెల్లువ పొడచూపింది. గత ట్రేడ్ యూనియన్లలో వారికి ప్రవేశార్హత లేదు. అందువల్ల వారు నైపుణ్యం లేని కార్మికులుగా తమ స్వంత ట్రేడ్ యూనియన్లను ఏర్పాటు చేసుకోవడం ప్రారంభించారు. ఏంగెల్స్ తన శక్తి మేరకు సామూహిక ఉద్యమాన్ని, 1889 లండన్ డాక్ కార్మికుల సమ్మెను బలపరిచారు. ఇప్పటికి ఇంగ్లీషు కార్మికవర్గ ఉద్యమంలో సహితం నూతన విప్లవ వీచికలు వీయసాగాయి. ఇదంతా లండన్ మేడే ప్రదర్శనలో ప్రస్ఫుటమైంది.

జర్మనీలో మేడే ప్రదర్శన మే 4 ఆదివారం జరిగింది. ఆ ప్రదర్శన ఎంతో ఉత్సాహ భరితంగా సాగినట్లు ఏంగెల్స్ భావించారు. బెబెల్‌కు రాసిన ఒక ఉత్తరంలో ఇలా అన్నారు. "నేను నాల్గవ వేదిక (ఒక పెద్ద ట్రక్కు) మీద వున్నాను. మొత్తం గుంపులో మూడవ వంతో, నాల్గవ వంతో మాత్రమే కనబడుతున్నారు. కాని కనుచూపు మేరకు ప్రజలు తొక్కిసలాడుతున్నారు. 2.5 నుండి 3 లక్షల వరకు వుంటారు. అందులో రెండు వంతులు ప్రదర్శకులే. అవెలింగ్‌లు, లాఫార్గ్, స్టెపినిక్‌లు నా వేదిక మీద నుండి మాట్లాడారు. నేను కేవలం ప్రేక్షక మాత్రుడుగా వున్నాను." ఆ జాబు చివరి "వేదిక ఎక్కాక మరో రెండు అంగుళాలు మెడసారించి చూశాను" అని కూడా అన్నారు.

కమ్యూనిస్టు ప్రణాళిక నాల్గవ జర్మన్ ప్రచురణకు 1890 మే 1న రాసిన తన ఉపోద్ఘాతంలో "సకలదేశ కార్మికులారా ఐక్యం కండి" ఈ నినాదం మేము 42 సంవత్సరాల క్రితం ఇచ్చాము. కార్మికవర్గం తిరుగుబాటు చేసి, తన హక్కులకై పోరాడిన పారిస్ విప్లవ ప్రాంగణంలో వున్నాము ఆనాడు. అయినా నా నినాదానికి చాలా కొద్ది గొంతులే ప్రతిస్పందించాయి. అంతర్జాతీయ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ కీర్తివంతమైన స్మృతికోసం పశ్చిమ యూరోప్‌లోని దాదాపు అన్ని దేశాల కార్మికులు 1864 సెప్టెంబరు 17న చేయి కలిపారు. అంతర్జాతీయ సంస్థ తొమ్మిదేండ్లూ మాత్రమే ఉనికిలో వుంది. కాని ఆ సంస్థ నిర్మించిన ఐక్యత శాశ్వతంగా మనుతుంది. అది ఏనాటి కన్నా బలంగా ఉంది. ఈనాడు జరుగుతున్న ఘటనలే అందుకు సాక్ష్యం. నేను ఈ మాటలు రాసేసరికి ఐరోపా, అమెరికాలలోని కార్మిక వర్గం తన శక్తిని అంచనా వేసుకుంటున్నది. అది చరిత్రలో మొదటిసారిగా ఒకే పతాకం కింద సమీకరింపబడి, ఒక తక్షణ డిమాండ్‌పై పోరాడుతూ ముందుకు సాగుతున్నది. ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ జెనీవాలో జరిగిన కాంగ్రెస్‌లో 8 గంటల పనిని చట్టబద్దం చేయాలని డిమాండ్ చేసింది. అదే కోరికను 1889 లో పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ సోషలిస్టు కాంగ్రెస్ పునరుద్ఘాటించింది. ఆ

కోరికే నేడు కార్మికవర్గ సమిష్టి నినాదంగా వున్నది. మన కళ్లెదుట జరుగుతున్న ఈ దృశ్యంవల్ల అన్ని దేశాల కార్మికులు వాస్తవంగా ఐక్యమవుతున్నారని అన్ని దేశాల పెట్టుబడిదారులు, భూస్వాములు గ్రహిస్తారు.

"ఈ దృశ్యాన్ని కళ్లారా చూసేందుకు మార్క్స్ బతికి వుంటే"

## మరొకసారి కాల్పులు, హత్యలు

కార్మికవర్గం అంతర్జాతీయ స్థాయిలో తలపెట్టిన ఈ కార్యక్రమంలో సహితం రక్తతర్పణ తప్పలేదు. ఆ కార్యక్రమం వెనుకగల సవాలును పాలకవర్గాలు గ్రహించాయి. అనేక చోట్ల ఆ కార్యక్రమాన్ని పాశవికమైన కాల్పులు, హత్యలతో అణచివేయబూనుకున్నారు. 1890 మే ఒకటవ తేదీన, మొదటి మేడే సందర్భంగా ఇటలీలో పోలీసులతో ఘర్షణ జరిగింది. ఆ తరువాతి సంవత్సరాలో ఫ్రాన్సు, ఇటలీ, స్పెయిన్ దేశాలలో ఘర్షణలుసాగాయి. ఉత్తర ఫ్రెంచి నగరమైన ఫోర్మీస్‌లో శాంతియుతంగాసాగే మేడే ప్రదర్శనపై రైఫిల్ కాల్పులు జరిగాయి. 50 మంది స్త్రీలు, పురుషులు, పనివారు నేలకోరిగారు. పది మంది అక్కడికక్కడే మరణించారు. ఫోర్మీస్ హత్యలను ఫ్రెంచి కార్మికవర్గం నిరసించింది. ఒక పార్లమెంటరీ ఉప ఎన్నికలో లాఫార్గ్‌ను సోషలిస్టు పార్టీ తన అభ్యర్థిగా నామినేట్ చేసింది. (ఆనాడు ఆయన ఫోర్మీస్ కాల్పులను నిరసిస్తూ మాట్లాడినందుకు జైల్లో మగ్గుతున్నారు) లాఫార్గ్ డిప్యూటీల చాంబర్‌లోకి తుపానులా ప్రవేశించారు.

రష్యాలో ట్రేడ్ యూనియన్ ఉద్యమం చట్టవిరుద్ధం. రాజకీయ పార్టీల కార్యకలాపాలకు అవకాశంలేదు. అలాంటి చోట కూడా మేడే ప్రదర్శనలు జరిగేవి. ఈ ప్రదర్శన సందర్భంగా పదేపదే సామూహిక అరెస్టులు, జైళ్లలో నిర్బంధం, కాల్పులు సాగుతూనే ఉండేవి. అయినప్పటికీ మేడే విజ్ఞప్తికి ప్రతి స్పందన పెరుగుతూనే ఉండేది. ప్రజాస్వామ్యం కోసం సాగిన పోరాటంలో మేడే ప్రదర్శనలు అంతకంతకూ ఎక్కువ ప్రాముఖ్యతగల పాత్ర వహించసాగాయి.

కాలం గడిచేకొద్దీ వివిధ దేశాల నుండి నూతన బృందాలుమేడేని అనుసరించేవారుగా తయారయ్యాయి. అంతర్జాతీయ కార్మికవర్గ ఐక్యతా పరిధి

విస్తరించింది. ప్రతి ఏటా పారిశ్రామిక దేశాలలో సాగే వేలాది మేడే ప్రదర్శకులతో, వలసదేశాలలోని పారిశ్రామిక నగరాల కార్మికులు లక్షలాది చేయి కలపసాగారు. సోషలిజానికి, మానవుడిని మానవుడు దోచుకొనే స్థితిని రద్దు చేసే స్వేచ్ఛ కోసం సాగే పోరాటానికి మేడే చిహ్నమై నిలిచింది. సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ విధానంపై నిరసనకు అత్యంత విస్తృతమైన వ్యక్తీకరణగా మేడే ప్రదర్శనలు రూపుదాల్చాయి. అంతర్జాతీయ కార్మికవర్గ డిమాండ్లకు సౌహార్దతను వ్యక్తం చేసేందుకు ఎక్కడికక్కడ ఫ్యాక్టరీల, జిల్లాల స్థాయిలో సమ్మె నిర్ణయాలు తీసుకునే వారు. కార్మికులలోని మిలిటెంట్ భాగాలు.

కార్మికవర్గ ఉద్యమం అంతటికీ మేడే సాంప్రదాయమై నిలిచింది.

## రష్యాలో మేడే

రష్యాలో లెనిన్, సోషల్ డెమొక్రటిక్ పార్టీల ఆధ్వర్యంలో మేడే ప్రదర్శనలు కార్మిక వర్గ విప్లవ కార్యాచరణకు కేంద్రంగా రూపొందాయి. మేడే కేవలం కోర్కెల పత్రంగా దిగజారకుండా లెనిన్, సోషల్ డెమొక్రటిక్ పార్టీలు జాగ్రత్త వహించాయి. పెట్టుబడిదారీ వర్గ పాలనను తుదముట్టించే విప్లవకర లక్ష్యం కనుమరుగు కాకుండా జాగ్రత్త పడ్డారు. యుద్ధాన్ని వ్యతిరేకించి, అంతర్జాతీయ శాంతి కోసం నిలవడం ద్వారా కార్మికవర్గ అంతర్జాతీయతా పతాకాన్ని వినువీధుల్లో నిలిపారు. ఆ దినం కేవలం అంతర్జాతీయతకు సంబంధించిన సాధారణ నినాదాలను మాత్రం నినదించే అంతర్జాతీయతా సౌహార్దతా దినంగా మాత్రమే నిలిచిపోకుండా చూశారు లెనిన్. ప్రజాతంత్ర సోషలిస్టు విప్లవాలలో నాయకత్వశక్తిగా కార్మికవర్గాన్ని సమీకరించే సాధనంగా రష్యన్ కార్మికవర్గం ఎదుర్కొంటున్న తక్షణ విప్లవకర్తవ్యాలను నిర్వహించే కేంద్రంగా కూడా ఆ ప్రదర్శనలను రూపొందించారు. మేడే గురించి లెనిన్ ఎంతో రాశారు. ఎన్నో మార్పులు ప్రవేశపెట్టారు. అవన్నీ విప్లవకర సాంప్రదాయాలకు, మేడే తాత్విక ధోరణికి కట్టుబడి వుండి కార్మికవర్గం తన కర్తవ్యాన్ని పరిపూర్తి చేసేలా రూపొందించేందుకే ఉద్దేశింపబడ్డాయి.

సెంట్ పీటర్స్‌బర్గ్‌లోని బృసెనోఫ్ సంస్థ రష్యాలో మొదటి మేడే సమావేశం ఏర్పాటు చేసింది. 1891 మే నెల మొదటి ఆదివారంనాడు రహస్యంగా ఆ సమావేశం జరిగింది. పోలీసు దాడి చేస్తే సులభంగా ఖాళీ చేసేందుకు వీలైనచోట ఏర్పాటు చేశారు. “మనకు అన్నిటినీ మించి ముందుగా కావలసింది ఒక సంఘటితశక్తి, తమ పరిస్థితులను

మెరుగుపరుచుకునేందుకు చైతన్యయుతంగా కృషి చేసే కార్మికవర్గంతో వుండేదిగా ఆ శక్తి ఉండాలి. ఆ శక్తి ప్రభుత్వం రాజకీయ హక్కులను యిచ్చేలా వత్తిడి తెచ్చేలా వుండాలి. ఎందువల్లనంటే ఆ పరిస్థితి మాత్రమే ఈనాడున్న ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించే అవకాశం కలిగిస్తుంది" అన్నారు ఒక ఉపన్యాసకుడు.

## మేడే డిమాండ్లపై లెనిన్

పదేళ్లు గడిచేసరికి మేడే నిర్వహణ అతి త్వరగా రాజకీయంగా పురోగమించింది. 1900లో ఖార్కోవ్ నుంచి లెనిన్ మేడే అనే కరపత్రానికి ఉపోద్ఘాతం రాశారు. "ఖార్కోవ్‌లో మేడే ఒక ప్రత్యేక ప్రాధాన్యత గల ఘటనగా ఏ విధంగా రూపొందింది? చాలా పెద్ద ఎత్తున కార్మికులు సమ్మెలో పాల్గొనడం, వీధుల్లో జరిగిన పెద్ద పెద్ద సభలు,ఎర్ర జెండాలను ఎగుర వేయడం, ప్రకటనలు, తీర్మానాల ద్వారా డిమాండ్లను ప్రకటించడం, ఎనిమిది గంటల పని, రాజకీయ స్వేచ్ఛ అనే విప్లవకర స్వభావంగల డిమాండ్లుగా అవి వుండడం, రష్యన్ కార్మికులు రాజకీయ పోరాటానికి అవసరమైనంతా పరిపక్వం చెందలేదని, కేవలం ఆర్థిక పోరాటాలలోనేవారు శ్రద్ధ చూపాలని వాటితో కొద్దికొద్దిగా, చాలా నెమ్మదిగా పాక్షిక రాజకీయ ఆందోళనను క్రమేపి జతచేయాలని, రష్యాలోని మొత్తం రాజకీయ విధానానికి వ్యతిరేకంగా గాక, రాజకీయ పాక్షిక సంస్కరణల కోసమే కేంద్రీకరించాలని ఒక కట్టుకథ ప్రచారంలో ఉంది. ఖార్కొవ్‌లో జరిగిన మేడే ఉత్సవాలు ఆ కట్టుకథను మొత్తం ఎందుకూ కొరగాని కథగా మార్చేశాయి" అని లెనిన్ ఆ ఉపోద్ఘాతంలో రాశారు.

ఆర్థిక కోర్కెల వలయాన్ని కార్మికులు ఛేదించారని లెనిన్ ప్రత్యేకించి ఇక్కడ గమనించారు. మేడే నాడుమౌలిక రాజకీయ డిమాండ్లకు సంబంధించిన రాజకీయ నినాదాలతో ముందుకు రావడాన్ని పేర్కొన్నారు. అదే సమయంలో మేడే ప్రకటనలలో వివిధ రకాల చిన్నచిన్న ఆర్థిక డిమాండ్లను సహితం పేర్కొనడం తప్పని లెనిన్ ఖార్కోవ్ కామ్రేడ్స్‌కు చెప్పారు. ఆర్థిక కోర్కెలు సహితం విప్లవాత్మక స్వభావంకలిగి ఉండాలి. అవి కార్మికుల విప్లవకర చైతన్యాన్ని పెంచాలి. రాజకీయ పోరాటానికి సహాయపడాలి. "ఉదాహరణకు రైల్వే వర్క్‌షాప్ ఉద్యోగాలు ప్రకటించిన డిమాండ్లను తీసుకుందాం. వారు ప్రకటించిన 14 డిమాండ్లలో 11 ఈనాటి రాజకీయ వ్యవస్థలో సహితం సులభంగానే సాధించుకోవచ్చు. అవి కేవలం చిన్న మార్పులను కోరేవి మాత్రమే. జీతాల పెంపకం,

పని గంటలు తగ్గించడం, దుర్మార్గాలను అరికట్టడం వంటివి ఆ డిమాండ్లు. వాటితో సమానమైనదేనన్నట్లు ఈ క్రింది మూడు డిమాండ్లను కూడా వాటితో జతచేశారు. 4) ఎనిమిది గంటలపని ప్రవేశపెట్టడం, (7) మే ఒకటి ఘటనల అనంతరం కక్షసాధింపులకు వ్యతిరేకంగా గ్యారంటీ (10) ఇరుపక్షాల మధ్య వివాదాల పరిష్కారానికి కార్మికుల యజమానుల సంయుక్త కమిటీ ఏర్పాటు. వాటిలో మొదటిది (4) ప్రపంచ కార్మికులు ముందుకు తెస్తున్న సార్వత్రిక డిమాండ్. ఈ డిమాండ్‌ను ఖార్కోవ్ కార్మికులు ముందుకు తేవడమంటే ప్రపంచ సోషలిస్టు కార్మికవర్గ ఉద్యమంలో తమ సౌహార్ధతను వారు గ్రహించినందుకు గుర్తు. సరిగ్గా అందువల్లనే ఫోర్‌మెన్ల పట్ల బాగా వ్యవహరించాలి. జీతాలు 10 శాతం పెంచాలి వంటి చిన్నకోర్కెలతో దానిని జతచేసిన వుండకూడదు. ప్రతి రంగంలో కార్మికులు తమ యజమానుల ముందు జీతాల పెరుగుదల, తమను సక్రమంగా చూడాలనేటువంటి డిమాండ్లను పెట్టవచ్చు. పెట్టాలిగూడాను. అవి వివిధ తరహాల కార్మికులు ఆయా రంగాలలో పెట్టవలసిన డిమాండ్లు. అయితే ఎనిమిది గంటల పనిని ప్రవేశపెట్టాలనే డిమాండ్ మొత్తం కార్మికవర్గం డిమాండ్. అది ఆ యజమానులకు ఇచ్చే డిమాండ్ కాదు. ప్రభుత్వ అధికారులకు ఇచ్చే డిమాండ్. ఆనాటి సాంఘిక, రాజకీయ వ్యవస్థ ప్రతినిధులుగా దానిని వారికిస్తున్నాము. అన్ని ఉత్పత్తి సాధనాల యజమానులుగా మొత్తం పెట్టుబడిదారీ వర్గానికి ఇచ్చే డిమాండ్ అది. ఎనిమిది గంటల పనికోసం చేసే డిమాండ్ ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. అంతర్జాతీయ సోషలిస్టు ఉద్యమంతో సౌహార్ధత ప్రకటించడం అది. ఈ తేడా గురించిన చైతన్యం కార్మికులకు కలిగించాలి. తద్వారా ఉచిత రైల్వే టిక్కెట్లు, ఒక వాచ్‌మాన్‌ను డిసిమిస్ చేయడంవంటి చిన్నచిన్న కోర్కెలతో ఎనిమిది గంటల పని దినాన్ని కుదించడం జరగకుండా చూడాలి. సంవత్సరం మొత్తం మీద, కార్మికులు ముందర ఒక చోట తరువాత మరొకచోట నిరంతరం రకరకాల పాక్షిక డిమాండ్లను తమ యజమానులను కోరుతుంటారు. వాటిని సాధించేందుకు పోరాడుతారు. ఈ పోరాటంలో కార్మికులకు సహాయం చేసే సందర్భంలో సోషలిస్టులు ఆ పోరాటానికీ అన్ని దేశాలలో కార్మికవర్గం తన విముక్తికోసం సాగే పోరాటానికి మధ్యగల సంబంధాన్ని నిరంతరం వివరిస్తుండాలి. అలాంటి సంబంధం తమకు అర్థమైందని, అలాంటి పోరాటంతో చేతులుకలుపుతాయని శపథం చేసే దినంగా మే ఒకటవ తేదీ రూపొందాలి.

మేడే యొక్క విప్లవ అవగాహనకు, ఆ రోజును పాక్షిక డిమాండ్ల దినంగా మార్చే సంస్కరణవాద అవగాహనకు ఇదీ లెనిన్ విభజన రేఖ గీసిన తీరు.

## మేడే - నిర్దిష్టమైన విప్లవ కర్తవ్యాలు

మేడే అంటే కేవలం అంతర్జాతీయ సౌహార్దతను జనరల్‌గా ప్రకటన చేయమని అర్థం కాదని కూడా లెనిన్ కార్మికులకు చెప్పారు. ఆయా దేశాలలో కార్మికులు ఎదుర్కొంటున్న నిర్దిష్టమైన విప్లవ కర్తవ్యాలకు అంకితం కావాలి.

విప్లవకర ప్రాధాన్యతగల తక్షణ ఆర్థిక కోర్కెలను, అంతర్జాతీయ సౌహార్దత సోషలిజంపట్ల జనరల్‌గా వాంఛను కలిపి ప్రకటించడం సరిపోదు. సోషలిజం లక్ష్యాన్ని చేరుకునేందుకు, కార్మికవర్గం తాను ఎదుర్కొంటున్న నిర్దిష్ట విప్లవ సమస్యలను పట్టించుకోవాలి. అందువల్ల మేడే సభలలో పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా సాగే పోరాటంలో భాగంగా ఈ సమస్యలను లేవనెత్తడం అవసరం.

ఇదీ 1902లో నార్తరన్ లీగ్‌కు రాసిన తన లేఖలో లెనిన్ చెప్పింది. “మనదేశంలో మేడే ప్రదర్శనలు నిరంకుశత్వానికి వ్యతిరేకంగా, రాజకీయ స్వేచ్ఛ కోసం జరిగే ప్రదర్శనగా కూడా తయారైందని కూడా చేర్చి వుండాల్సింది. ఆ పవిత్ర దినం గురించిన అంతర్జాతీయ ప్రాధాన్యతను ఎత్తి చూపడంతో సరిపోదు. దానిని కీలకమైన జాతీయ రాజకీయ డిమాండ్లతో జతచేయాలి.

1903లో రానున్న మేడే సందర్భంలో సహితం లెనిన్ అదే అంశాన్ని నొక్కి చెప్పారు “తుట్టదుతకు కార్మికుల సమాధానాన్ని వీధుల కెక్కించాలి. ప్రదర్శనల ద్వారా మన డిమాండ్లను చాటాలి. రాజకీయంగా కార్మికుల సంఖ్యను, బలాన్ని ప్రదర్శించాలి. కార్మికవర్గ చైతన్యాన్ని కృతనిశ్చయాన్ని తెలియజేయాలి. రానున్న మేడే ఉత్సవం కార్మికవర్గపు జనరల్ డిమాండ్ల ప్రకటనగా మాత్రమేగాక, ఫిబ్రవరి 26 ప్రణాళికకు ప్రత్యేకమైన స్పష్టమైన సమాధానంగా కూడా ఆ ఉత్సవం జరపాలి.

ప్రజలను వెర్రి వాళ్లను చేసేందుకు రష్యన్ జార్ ప్రకటించిన ప్రణాళికే ఫిబ్రవరి 26 ప్రణాళిక.

సమావేశ, పత్రికా స్వేచ్ఛలు, రాజకీయ ఖైదీలకు, మత సంఘాల సభ్యులకు తక్షణమే, ఎలాంటి షరతులు లేకుండా చట్టంద్వారా గుర్తించడం 2) పౌరులంతా కలసి ఎన్నుకొనే రాజ్యాంగసభకు ఏర్పర్చుడం,ఎన్నికైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్

3) ఇతర సామాజిక తరగతులతో రైతాంగానికి సమానత్వాన్ని తక్షణమే, బేషరతుగా చట్టంద్వారా ఆమోదించడం గ్రామీణ ప్రాంతాలలో అర్థబానిన అవశేషాలను రద్దుచేసేందుకు రైతాంగకమిటీల సమావేశం ఏర్పాటు చేయడం వంటి రాజకీయ డిమాండ్లను మేడే సందర్భంగా లేవనెత్తాలని లెనిన్ చెప్పారు. ఒక్కముక్కలో చెప్పాలంటే ప్రజాతంత్ర విప్లవపు పరివక్వత పొందుతున్న నినాదాలను మేడే సందర్భంగా వ్యక్తం చేయాలని లెనిన్ కోరారు.

## రష్యా జపాన్ యుద్ధం

1904 నాటికి రష్యా, జపాన్ యుద్ధం ప్రారంభమైంది. యుద్ధానికి ఏదో సాధారణ వ్యతిరేకతను వ్యక్తం చేసే సమయం కాదు అది. జపాన్‌కు వ్యతిరేకంగా జార్ జరుపుతున్న యుద్ధాన్ని నేరుగా వ్యతిరేకించే సమస్య ముందు కొచ్చింది. తమను తాము సోషలిస్టులుగా భావించుకునే అనేకమంది సోషల్ డెమోక్రాట్లు ఇతరులు యుద్ధ వ్యతిరేకతలో ఊగిసలాడసాగారు. బూర్జువా జాతీయవాదపు సెగలకు లోనైనారు. ఇలాంటి పరిస్థితిలో లెనిన్ మేడే కోసం ఒక కరపత్రం రాశారు. అందులో యుద్ధాన్ని వ్యతిరేకించమని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. “దేశంలో దారిద్ర్యం, ఆకలితో మన ప్రజలు కూలిపోతున్నారు. అయినా వారిని వినాశకరమూ, అర్థరహితమూ అయిన యుద్ధంలోకి లాగుతున్నారు. విదేశీ జాతులు నివశించే వేలాదిమైళ్ళ దూరాన వున్న, పరాయి భూభాగాలలో యుద్ధ రంగానికి ఈడుస్తున్నారు. బానిసత్వంలో మన ప్రజలు కుంగిపోతున్నారు. అయినా ఇతర జాతులను బానిసత్వంలోకిలాగే యుద్దంలోకి ప్రజలను ఈడుస్తున్నారు. దేశ రాజకీయ వ్యవస్థలో మార్పులను డిమాండ్ చేస్తున్నారు. మన ప్రజలు. మరో ప్రపంచపు అంచున పేలే తుపాకీ మోతలతో ఈ డిమాండ్‌ను పక్కదారులు పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు పాలకులు” అని రాశారు లెనిన్.

జార్ పాలనకు వ్యతిరేకంగా నిర్ణయాత్మక సమరానికి సిద్ధం కావలసిందిగా లెనిన్ పిలుపునిచ్చారు. “మనకెదురౌతున్న సమరంలో నిర్ణయాత్మకంగా పాల్గొనేందుకు రెట్టింపు శక్తితో సంసిద్ధం కావాలి. కామ్రేడ్స్ కార్మికులారా!అపూర్వమైన రీతిలో సోషల్ డెమొక్రటిక్ కార్మిక విభాగాలు సన్నిహితం కావాలి. దూరతీరాలకు వారి మాటలను వ్యాపింపజేయాలి. మరింత సహనంతో కార్మికుల డిమాండ్లకై ఉద్యమం సాగించాలి, మన సమిష్టి లక్ష్యం కోసం పోరాడే నూతన శక్తులను వేలాదిగా సంపాదించేందుకు

మేడే వుత్సవం జరపాలి. ప్రజలందరి స్వేచ్ఛకు, పెట్టుబడిదారీ శృంఖలాల నుండి శ్రమజీవులందరికీ విముక్తి సాధించేందుకు అపారమైన శక్తులను సమీకరించేలా మేడే ప్రదర్శనలు జరగాలి.

ఎనిమిది గంటల పనిదినం – వర్థిల్లాలి

అంతర్జాతీయ విప్లకర సోషల్ డెమోక్రసీ – వర్థిల్లాలి

దోపిడీ, దుర్మార్గపు జార్ నిరంకుశత్వం – నశించాలి

## 1905 విప్లవ సందర్భంగా మేడే

1905 విప్లవ సంవత్సరం. దేశమంతా విప్లవ పరిస్థితి నెలకొంటున్నది. ఆ పరిస్థితికి అనుగుణమైన మేడే నినాదాలు రూపొందాలి. రష్యా, జపాన్ యుద్ధం ఇంకా కొనసాగుతున్నది. దానిని వ్యతిరేకించాలి. అదే సమయంలో సోషలిస్టు ఉద్యమ అంతర్జాతీయ ఐక్యత విషయమై కార్మికవర్గాన్ని హెచ్చరించాలి. 1905 మేడేకోసం లెనిన్ మరొక కరపత్రం రాశారు. "కామ్రేడ్స్ కార్మికులారా, ప్రపంచ కార్మికుల మహత్తర సెలవుదినం రానున్నది. వెలుగు విజ్ఞానాలను తమ జాగృతిని మే మొదటి రోజున పండుగ చేసుకుంటారు. అన్ని రకాల దోపిడీకి, అన్ని విధాల నియంతృత్వానికి, వివిధ రకాల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా, సోషలిస్టు విధాన సమాజ సాధనకు సాగించే పోరాటంలో ఒకే సౌహార్దతా యూనియన్‌లో తమ ఐక్యతను ప్రదర్శించాలి.

"విభిన్న జాతులకు, విశ్వాసాలకు చెందిన కార్మికుల మధ్య శత్రుత్వం నశించాలి. అలాంటి శత్రుత్వం దోపిడీదారులకు,నిరంకుశులకు మాత్రమే లాభం. వారు కార్మికవర్గ అనైక్యత, అజ్ఞానంపైనే తమ మనుగడ సాగిస్తున్నారు. యూదులు,క్రైస్తవులు, ఆర్మేనియన్లు, తార్తారులు, పోలిష్ జాతి, రష్యన్లు,ర ఫిన్నిష్‌జాతులు, స్వీడిస్ ప్రజలు, లెట్స్, జర్మన్లు అందరూ వారంతా ఒకే సోషలిస్టు పతాకం క్రింద సమిష్టిగా పురోగమిస్తారు. అన్ని దేశాల కార్మికుల ఈ ఐక్యత, అంతర్జాతీయ సోషల్ డెమోక్రసీ తన శక్తులను మేడే నాడు పునఃపరిశీలించుకుంటుంది. ఎలాంటి వెసులుబాటు, తడబాటులేని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాల సాధనకు మరింత ముందుకు సాగే పోరాటంలో తన శక్తులన్నింటినీ సమీకరిస్తుంది' అన్నారు కామ్రేడ్ లెనిన్ ఆ కరపత్రంలో.

"దూర ప్రాచ్యంలో అసువులు అర్పించేందుకు లక్షలాది యువ జీవితాలను ప్రజల నుండి దూరంగా తీసుకెళ్తున్నారు. ఇంతకూ ఆ యుద్ధం ఎందుకు? మంచూరియా కోసం. ఆ మంచూరియాను మన దోపిడిదారీ ప్రభుత్వం చైనా నుంచి కాజేసింది. విదేశీ భూభాగాల కోసం రష్యన్ రక్తం రాల్చబడుతున్నది. దేశం నాశనం చేయబడుతున్నది.

"ప్రజల తిరుగుబాటు ఉత్సవంగా ఈ ఏడాది మే మొదటి తారీఖున జరుపుకుందాం. అందుకు సిద్ధమవుదాం. నియంతలపై నిర్ణయాత్మక పోరాటానికి పచ్చజెండా కోసం ఎదురుచూడండి. మహత్తర సమరాలకు సిద్ధంకండి. కామ్రేడ్ కార్మికులారా! మే మొదటి తేదీన ఫ్యాక్టరీలలో మిల్లులలో పని నిలుపు చేయండి. సోషల్ డెమొక్రటిక్ లేబర్ పార్టీ కమిటీ సలహా మేరకు ఈ ఆయుధాలు చేపట్టండి. జనవరి 9న సెంట్‌పీటర్స్‌బర్గ్ కార్మికులు స్వాతంత్ర్యమో, మరణమో తేల్చుకోవాలని ప్రకటించారు. రష్యన్ కార్మికులంతా ఆ మహాసమర నినాదాన్ని ప్రతిధ్వనించాలి. ఎలాంటి త్యాగాలకు మరల జంకరాదు. తిరుగుబాటు ద్వారా స్వేచ్ఛను, స్వేచ్ఛద్వారా సోషలిజాన్ని మనం సాధించుకుంటాం.

"మే మొదటితేదీ వర్ధిల్లాలి. ఇంటర్నేషనల్ సోషల్ డెమొక్రసీ వర్ధిల్లాలి. కార్మిక, కర్షక స్వేచ్ఛ వర్ధిల్లాలి. ప్రజాతంత్ర రిపబ్లిక్ వర్ధిల్లాలి. జారిస్టు రిపబ్లిక్ నశించాలి. జారిస్టు నియంతృత్వం నశించాలి" అని రాశారు కామ్రేడ్ లెనిన్.

కార్మికవర్గ పార్టీ అయిన సోషల్ డెమొక్రటిక్‌పార్టీ లెనిన్ నాయకత్వాన అనేక పోరాటాలు సాగించింది. పాక్షిక కోర్కెల కోసం సాగే పోరాటాన్ని దోపిడీదారీ యుద్ధాన్ని వ్యతిరేకించడం, పెట్టుబడిదారీ విధానాన్ని తుదముట్టించడం అనే లక్ష్యాలతో సమ్మిళితం చేసి నడవడం ద్వారా మేడే విప్లవ సాంప్రదాయాన్ని కాపాడింది. దీంతోపాటు ముంచుకొస్తున్న ప్రజాతంత్ర విప్లవకర్తవ్యాలను పూర్తి చేసి, సోషలిజానికి మార్గం సుగమం చేసేందుకు ఆనాటి రష్యన్ పరిస్థితులలో అవసరమైన రాజకీయ నినాదాలను, విప్లవకర పరిస్థితి క్రమేపి అభివృద్ధి కావడంతో రష్యాలో మేడే మొత్తం ప్రజల విప్లవ డిమాండ్ల మే సోషల్ డెమొక్రటిక్ పార్టీ లేవనెత్తింది. విప్లవకర డిమాండ్లను ప్రతిబింబించసాగింది. 1905 నాటికి ఆయుధాలను చేపట్టమనే డిమాండ్‌ను లెనిన్ లేవనెత్తగలిగారు.

ఈ సంవత్సరాలలో రష్యా, విప్లవోద్యమ తుపాను కేంద్రమైనది. 1905 విప్లవం విఫలమైంది. కాని లెనిన్ బోల్షివిక్ పార్టీల నాయకత్వాన, మార్క్స్,ఏంగెల్స్‌ల విప్లవకర

బోధనలను అనుసరించి 1905 ఓటమిని అధిగమించి రష్యన్ కార్మికవర్గం 1917లో సోషలిస్టు విప్లవ విజయం సాధించగలిగింది.

## విప్లవ సాంప్రదాయాల నుండి దిగజారుడు

అయితే ఐరోపాలోని అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలో పరిస్థితి పూర్తిగా భిన్నంగా తయారైంది. వీటిలో కొన్నింటిలో ఒక సమయంలో కార్మికవర్గ ఉద్యమానికి మార్క్సిస్టు నాయకత్వం ఉండేది. పెట్టుబడిదారీ విధానంలో 'శాంతియుత', కాలం తలెత్తింది. పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంగా మారింది. వలస దేశాలను దోపిడీ చేయడం మూలంగా లాభపడిన ప్రత్యేక హక్కులు పొందే అతి కొద్ది మంది కార్మిక నిరంకుశులు (ప్రివిలేజ్డ్ లేబర్ అరిస్ట్రోకసీ) తలెత్తింది. కార్మికులకు కొన్ని పార్లమెంటరీ, ప్రజాతంత్ర హక్కులు కొంత వరకు విస్తరించాయి. ఇవన్నీ కలిసి సోషలిజానికి శాంతియుతంగా పురోగమించ వచ్చనే భ్రమలు ఏర్పడ్డాయి. సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంలో క్రమేపి ఒక రివిజనిస్టు ధోరణి తలెత్తింది. వర్గ పోరాటం, విప్లవం ఏ మాత్రం అవసరంలేదని భావించే ధోరణి ఇది. మేడే ప్రదర్శనలో ఇమిడి ఉన్న కార్మిక వర్గ విప్లవ, మిలిటెంట్ సాంప్రదాయాలకు తిలోదకాలు ఇవ్వడం ప్రారంభమైంది.

ట్రేడ్ యూనియన్ నాయకత్వమే ప్రధానంగా ఈ రివిజనిస్టు ధోరణి, దృక్పథాలను వ్యక్తం చేయసాగింది. అప్పటికే చాలా కాలంగా బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ ఉద్యమం సంస్కరణవాద, మిలాఖత్‌దారీ పద్ధతులలో నడవబడుతున్నది. సమ్మెల ద్వారా మేడే జరుపుకోవడాన్ని సదా నిరాకరించేది. బ్రిటిషు ట్రేడ్ యూనియన్ ఉద్యమం గురించే 1879లోనే ఏంగెల్స్ ఇలా అన్నారు. 'అదనపు జీతాలు, పని గంటల తగ్గింపునకు జరిగే హ్రస్వ పరిధి సమ్మెలనే నిస్సహాయంగా అభివర్ణిస్తోంది. అయితే ఇలాంటి సమ్మెలకు తప్పని పరిస్థితులలోనో, ప్రచార సాధనంగానో, నిర్మాణాన్ని పెంచుకునేందుకో చేపట్టడం లేదు. అవే చరమ లక్ష్యంగా భావిస్తున్నారు. ఒక సూత్రంగా, స్వభావంగానే ట్రేడ్ యూనియన్లు అన్ని రాజకీయ కార్యకలాపాలను నిషేధిస్తున్నాయి. ఆ విధంగా కార్మికవర్గం ఒక వర్గంగా సార్వత్రిక కార్యకలాపాలలో పాల్గొనడాన్ని కూడా అడ్డుకుంటున్నారు. కాంటినెంట్ అనే అర్థంలో ప్రస్తుతం నిజమైన కార్మికవర్గ వుద్యమం లేదనే విషయం దాచేందుకు ఎలాంటి ప్రయత్నం చేయరాదు"

సోషలిస్టు ఇంటర్నేషనల్ సంస్థాపనకు ఒక దశాబ్దం ముందున్న పరిస్థితి ఇది. కాంటినెంట్ పార్టీలలో సహితం ఇదే ధోరణి పెంపొందసాగింది. ఆ ధోరణి సహజంగానే మేడే నుండి దాని విప్లవసారం నుండి తొలగించ చూసింది. పెట్టుబడిదారీ వ్యవస్థ పరిధిలోనే కొద్దిపాటి ఆర్థిక డిమాండ్లను ముందుకు నెట్టేందుకే పరిమితం కాసాగారు.

## జేనా కాంగ్రెస్ పై లెనిన్

జర్మన్ పార్టీలో ఇలాంటి పోకడలను 1905 నాటికే లెనిన్ గమనించారు. జర్మన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ జేనా కాంగ్రెస్ గురించి ఒక వ్యాసం రాస్తూ లెనిన్ ఇలా అన్నారు. “రాజకీయ సమ్మె సమస్య కన్నా ముందు మరొక సమస్య చర్చకు వచ్చింది. అది రష్యాకు ఎంతో విజ్ఞానకరమైంది. మేడే సమస్యే ఈ సమస్య. (ఈ సమస్యపై చర్చకు దారి తీసిన అంశాన్ని గాక, విషయసారం దృష్ట్యా చూస్తే) ఇంకా స్పష్టంగా పేర్కొనవచ్చు. ఇది సోషల్ డెమొక్రటిక్ పార్టీతో ట్రేడ్‌యూనియన్ ఉద్యమానికి వుండవలసిన సంబంధం సమస్య అది. జర్మన్ సోషల్ డెమొక్రాట్లపై, కేవలం వారిపైనేకాదు, కొలోన్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌నెరపిన ప్రభావం గురించి ప్రొలెటరీ చాలా మార్లు ప్రసంగించారు. మార్క్సిజం సాంప్రదాయాలు బాగా బలంగా ఉన్న జర్మనీలో సహితం, ట్రేడ్ యూనియన్లలో సోషలిస్టు వ్యతిరేక ధోరణులు ప్రవర్ధమాన మవుతున్నట్లు ఈ కాంగ్రెస్‌లో స్పష్టమైంది. బ్రిటిష్ వారి స్వచ్ఛమైన ట్రేడ్ యూనియనిజం” ధోరణి అంటే సంపూర్ణమైన బూర్జువా తరహా పెంపొందించుతున్నది అని ఈ కాంగ్రెస్ రుజువు చేసింది. ట్రేడ్ యూనియన్లు అంటే సోషల్ డెమొక్రటిక్ ట్రేడ్ యూనియన్లు అనే విషయం గుర్తుంచుకోండి. మేడే ప్రదర్శనలు అనే సాధారణ విషయం నుండి ట్రేడ్ యూనియనిజము, సోషల్ డెమొక్రసీల సమస్య అనివార్యంగానే జేనా కాంగ్రెస్‌లో తలెత్తింది. రష్యన్ సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంలో వచ్చిన ధోరణుల భాషలో చెప్పాలంటే ఆర్థిక తత్వధోరణి అక్కడా ప్రతిబింబిస్తున్నది.

“ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో సోషలిస్టు భావన అదృశ్యమవుతున్న విషయం విస్మరించడం పెద్ద పొరపాటు అవుతుందని మేడే సమస్యపై నివేదిక ఇస్తూ ఫిషర్ స్పష్టంగానే చెప్పాడు. విషయం చాలా దూరం పోయింది. ఉదాహరణకు కార్పెంటర్స్ యూనియన్ ప్రతినిధి బ్రింగ్‌మాన్ “మేడే నాడు సమ్మె చేయడం మానవ శరీరంలో ఇతర క్షుద్ర అంశాలు ప్రవేశించడం వంటిది” అని రాశారు. “ఈనాటి పరిస్థితులలో కార్మికుల పరిస్థితిని మెరుగుపరచే ఏకైక సాధనమే ట్రేడ్ యూనియన్లు” అని కూడా అన్నారు.

ఫిషర్ సరిగానే అభివర్ణించినట్లు  ఈ రుగ్మతా చిహ్నాలు అనేక ఇతరులలో సహితం కనిపిస్తున్నాయి. రష్యాలోలాగే జర్మనీలో కూడా నిజం చెప్పాలంటే ప్రతిచోటా హ్రస్వ దృష్టిగల ట్రేడ్ యూనియనిజంలేదా ఆర్థిక తత్వమనేది అవకాశవాదతో జతకడుతున్నది.”

శాస్త్రీయ సోషలిజపు కూలిపోతున్న పునాదులను గురించి, అదే కార్పెంటర్స్ యూనియన్ ప్రకటించే పత్రికల్లో రాస్తున్నారు. సంక్షోభాన్ని గురించిన తప్పుడు సిద్ధాంతాలు ప్రచురిస్తున్నారు. కూలిపోవడంపై సిద్ధాంతం లాంటివి ప్రచారం చేస్తున్నారు. కార్మికులను తమ అసంతృప్తి వ్యక్తం చేయమని, తమ డిమాండ్లను పెంచమనీగాక, కార్మికులు తమ కోర్కెలలో నమ్రత చూపాలనే వంటి మాటలను రివిజనిస్టు కాల్‌వర్ ప్రకటిస్తున్నారు.

హ్రస్వ పరిధిగల ట్రేడ్ యూనియన్ తత్వపు ప్రమాదాన్ని బెబెల్ పూర్తిగా గుర్తించారు. ఆయా వృత్తి ట్రేడ్ యూనియన్ల నిర్లిప్తత గురించిన అతి హీనమైన ఉదాహరణలు తనకు తెలుసునని  ఆయన చెప్తూనే వున్నాడు. మొత్తంగా పార్టీ, సోషలిజం, వర్గపోరాట సిద్ధాంతంపట్ల యువ ట్రేడ్ యూనియన్ కార్యకర్తలు అవహేళన చేస్తున్నారు.”

పశ్చిమ ఐరోపాలో పెరుగుతున్న ధోరణి ఇదికాగా. లెనిన్ మార్గదర్శకత్వం మూలంగా రష్యాలో పెంపొందుతున్న విప్లవకర పరిస్థితి మధ్య మేడే ప్రదర్శనలు మొత్తం ప్రజల విప్లవ కార్యకలాపాలకు చిహ్నంగా నిలిచాయి. 1912లో “విప్లవకర కెరటం” అనే తన వ్యాసంలో “అఖిల రష్యా కార్మికుల మేడే సమ్మె, దానితో జరిగిన వీధి ప్రదర్శనలు, విప్లవకర కరపత్రాలు, కార్మిక సమావేశాల్లో విప్లవకర ఉపన్యాసాలు రష్యా విప్లవ కెరటపు ప్రాంగణంలో ప్రవేశించిందని స్పష్టం చేస్తున్నాయి.” అని రాశారు లెనిన్.

## 1912-1913 మేడే

మేడే నాడు కార్మిక వర్గం ప్రజలందరి నాయకుడుగా ఆవిర్భవించిందని 1912 మేడే ప్రాధాన్యత ప్రత్యేకించి పేర్కొన్నారు లెనిన్. “ఒక రాజ్యాంగ సభ, ఎనిమిది గంటల పని దినం, భూమి ఎస్టేట్ల స్వాధీనం అనేవి మన నినాదాలుగా వుండాలని సెంట్ పీటర్స్‌బర్గ్ కమిటీ కరపత్రం పేర్కొంది. జారిస్టు ప్రభుత్వం నశించుగాక, జూన్ 3 నిరంకుశ రాజ్యాంగం నశించుగాక, ప్రజాతంత్ర రిపబ్లిక్ వర్ధిల్లుగాక, సోషలిజం వర్ధిలుగాక” అనే పిలుపును సహితం ఆ కరపత్రం ప్రవేశపెట్టింది’ అని రాశారు లెనిన్.

రష్యా అంతటా కార్మికులంతా అనుసరిస్తుండగా, లక్షలాది సెంట్ పిటర్స్‌బర్గ్ కార్మికులు సమ్మెలకు, ప్రదర్శనలకు పూనుకున్నారు. అయితే బూర్జువా సమాజపు వేర్వేరు

వర్గాల మాదిరి సాగలేదు ఈ ఉద్యమం. "తమ స్వంత" కేవలం ఆర్థిక నినాదాలతోనే గాక, మొత్తం ప్రజలందరి విప్లవ పతాకను వినువీధులకు ఎగరేశారు. మొత్తం ప్రజలు అందరి తరఫున వారిని జాగృతమొనర్చే లక్ష్యంతో, స్వేచ్ఛను వాంఛించే, దానికై పోరాడగల అన్ని వర్గాలను పోరాటంలోకి ఆకర్షించేందుకు వారీ ఉద్యమం సాగించారు."

విప్లవకర డిమాండ్లకు మద్దతుగా 3 లక్షల మంది కార్మికులు సమ్మె చేశారు.

1913 మేడే ప్రదర్శనలను అభివర్ణిస్తూ రాజకీయ పోరాటాలలో కార్మిక వర్గ నాయకత్వ పాత్రను నొక్కి వక్కాణించారు. "రష్యన్ కార్మికవర్గ మేడే కార్యాచరణ మరోసారి వస్తోంది. రేగాలోవారు మొదట రిహార్సల్స్ వేశారు. ఆ తరువాత మే ఒకటవ తేదీన కృతనిశ్చయమైన కార్యాచరణకు పూనుకున్నారు సెంట్ పీటర్‌బర్గ్‌లో.. రానున్న విప్లవ కర్తవ్యాలన్నీ మరోసారి వైభవోపేతంగా ముందుకొచ్చాయి. అగ్రగామివర్గ శక్తులు దానికి నాయకత్వం వహిస్తున్నాయి. వందలాది పాత విప్లవకారుల కెంతో ఆహ్లాదం కలిగిస్తుంది. హంతకుల నిర్బంధాలు, స్నేహితుల ఏకాకులను చేసినా వారు ఓడిపోలేదు. కుంగిపోలేదు. నూతనతరం ప్రజాస్వామిక శక్తుల, సోషలిస్టుల ముందువారు తలెత్తుక నిలబడుతున్నారు."

మేడే నాటి ఘటనలను, ఆనాడు సాగిన దౌష్ట్యాన్ని వర్ణిస్తూ "మేడేకి వారాల ముందే ప్రభుత్వం నివ్వెరపోయింది. మానసికశక్తి కోల్పోయింది. ఇక ఫ్యాక్టరీలకు యజమానులైన వారు తమకసలు మానసిక ప్రతిస్పందనే లేని వారిలా ప్రవర్తించారు. రాజధానిలోని కార్మికులు జిల్లాలో జరిగిన అరెస్టులు, శోధనలు ఆ ప్రాంతాలను తల్లకిందులు చేసినట్లు కనిపిస్తున్నది. ఈ కేంద్రాల కన్నా రాష్ట్రాలు వెనుకబడుతున్నట్లు లేదు. ఇబ్బందులు పడుతున్న ఫ్యాక్టరీ యజమానులు సమావేశాలు జరుపుతున్నారు. విరుద్ధమైన నినాదాలు చేపడుతున్నారు. ఒకసారి కార్మికులనుశిక్షిస్తామని, లాకౌట్లు చేస్తామని బెదిరిస్తున్నారు. మరొకసారి ముందుగానే సౌకర్యాలు యిస్తామని లాలిస్తున్నారు. పని నిలుపుదలకు తామే అంగీకరిస్తామని అంటున్నారు. ఇంకొకసారి దౌర్జన్యాలు జరపమని ప్రభుత్వాన్ని రెచ్చగొడుతున్నారు. ప్రభుత్వాన్ని నిందిస్తారు. అధికార సెలవు దినాలలో మేడేని కూడా చేర్చమని అభ్యర్థిస్తారు.

"పోలీసు అధికారులు విచ్చలవిడిగా ప్రవర్తించినా, పారిశ్రామిక నివాస ప్రాంతాలను "అణగదొక్కినా", "ఈ మధ్యనే తయారైన అనుమానితుల"ను విచ్చలవిడిగా అరెస్టు చేసినా, ఏమీ ప్రయోజనం కనిపించలేదు. జార్ ముఠా చేతగాని క్రోధం చూసి

కార్మికులు నవ్వుకుంటున్నారు. పెట్టుబడిదారీ వర్గ నిర్వీర్యతను హేళన చేస్తున్నారు. ప్రభుత్వం  వినాశకరమైన దయనీమైన "ప్రకటనలను" ఖండిస్తున్నారు. వ్యంగ్య గీతాలు రాస్తున్నారు కార్మికులు. ఆ పాటలు ఆ నోటా ఆ నోటా అందరిలోకి వ్యాపిస్తున్నాయి. చేతితో రాసిన పక్క వారికి అందిస్తున్నారు. ఆకాశం నుండి వూడిపడినట్లు ఎప్పటికప్పుడు కొత్త కరపత్రాలు వచ్చిపడుతున్నాయి. అవి సొంపుగా లేవు. కాని విషయం సూటిగా, క్లుప్తంగా వుంటున్నది. సమ్మెలకు, ప్రదర్శనలకు పిలుపునిస్తున్నారు. వాటిలో, ప్రజలకు సూచనలు అందుతున్నాయి వాటి ద్వారా. గతంలో ప్రజల గుండెలలో మోగిన విప్లవ నినాదాలను గుర్తు చేస్తున్నారు. 1905లో నిరంకుశత్వానికి, రాచరికానికి వ్యతిరేకంగా ప్రజా దాడులకు నాయకత్వం వహించిన సోషల్ డెమొక్రాట్లు రూపొందించిన నినాదాలు అవి. ఎలాంటి కత్తిరింపులు లేకుండా ప్రచారమవుతున్నాయి.

సోషల్ డెమొక్రటిక్ పార్టీ నాయకత్వాన, లెనిన్ నేతృత్వంలో ప్రతి మేడే, పాలకవర్గాలకు ఒక పీడకలగా పరిణమించింది. మొత్తం ప్రజలకు అదొక మహా సంస్థగా, ఉద్రిక్తతా నావ ప్రదాయినిగా తయారైంది.

## 1914 సామ్రాజ్యవాద యుద్ధం

## కూలిపోయిన సంస్కరణవాదం

1914 ఆగస్టులో మొదటి సామ్రాజ్యవాద యుద్ధం బద్దలైంది. బోల్షివిక్ పార్టీ జార్ ప్రభువుల సామ్రాజ్యవాద యుద్ధాన్ని వ్యతిరేకించింది. యుద్ధ సంక్షోభాన్ని విప్లవ ప్రయోజనాలకు వాడుకోవాలని నిర్ణయించింది. అధికార స్వాధీనం చేసుకునేందుకు వినియోగించాలని భావించింది. ప్రారంభంలో ఎనలేని దౌర్జన్యాన్ని ఎదుర్కొన్నది. కార్మికవర్గంలోని సంస్కరణవాదుల నుండి వ్యతిరేకత వచ్చింది. యుద్ధాన్ని వ్యతిరేకించాలనే అంతర్జాతీయ సాంప్రదాయాలకు కట్టుబడి, తుదకు జార్‌ను కూల ద్రోయడంలో విజయవంతులైనారు. పెట్టుబడిదారీ పాలన కూలగొట్టారు. ప్రపంచంలో మొదటి సోషలిస్టు రాజ్యాన్ని ఏర్పర్చి విజయదుందుభి మ్రోగించారు.

దురదృష్టవశాత్తూ బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్సు, అమెరికా మొదలైన దేశాలలో ట్రేడ్ యూనియన్లు సంస్కరణవాద నాయకత్వపు వత్తిళ్లతో పూర్వపు మేడే మిలిటెంట్ సాంప్రదాయాలు భగ్నమయ్యాయి.  పెట్టుబడిదారీ విధానాన్ని కూలగొట్టి, సోషలిజపు

ఉషోదయాన్ని సాధించడంలో తన వర్గ శక్తి, యుక్తులను బేరీజు వేసుకునే దినంగా గాక మేడేని ఒక సాధారణ సెలవు దినంగా మార్చివేశారు.

మేడే నిర్వహణకు సమ్మెను ఒక పద్ధతిగా విసర్జించారు ఆ నాయకులు. కేవలం మేడే కోసం ఫ్యాక్టరీ స్థాయి సెలవు కోసం ఎక్కువసార్లు కృషి చేశారు. తమ వర్గసంకర విధానాలను కొనసాగిస్తూ, క్రమేపి అంతర్జాతీయ దృక్పథాన్నే విసర్జించారు. సామ్రాజ్యవాద యుద్ధంపట్ల ఊగిసలాడే లేదా విప్లవ ప్రతీఘాత వైఖరులు చేపట్టారు. ఫలితంగా మొదటి ప్రపంచ యుద్ధం బద్దలైనపుడు, దానిని వ్యతిరేకించి, కార్మికవర్గ అంతర్జాతీయ ఐక్యత పరిరక్షించే బదులు, సామ్రాజ్యవాద యుద్ధ నిర్వహణలో తమ తమ సామ్రాజ్యవాద పాలకులకు మద్దతు ఇవ్వసాగారు. రష్యాలో బోల్షివిక్ విభాగం, లెనిన్ నాయకత్వాన జర్మనీలో రోజా లగ్జెంబర్గ్‌లో నాయకత్వానగల సోషల్ డెమోక్రసీ విభాగం మాత్రమే అంతర్జాతీయతకు కట్టుబడి, యుద్ధాన్ని వ్యతిరేకించారు. మేడే మిలిటెంట్ సాంప్రదాయాన్ని, దాన్ని అంతర్జాతీయ స్వభావాన్ని కమ్యూనిస్టులు విప్లవకర ట్రేడ్ యూనియన్లు మాత్రమే పరిరక్షించారు. అందువల్లనే రష్యన్ కార్మికవర్గం సోషలిస్టు విప్లవాన్ని జయప్రదం చేశాయి. ఉమ్మడి ఉద్యమానికి ఘనవిజయం సాధించాయి.

## సంస్కరణవాద విధానం కొనసాగింది

మొదటి ప్రపంచయుద్ధం తర్వాతకూడా సంస్కరణవాదులు తమ ఎత్తుగడను మార్చుకోలేదు. పెట్టుబడిదారీ ప్రభుత్వాలతో అంతకంతకూ ఎక్కువగా మిలాఖత్ కాసాగారు. కొన్ని తక్షణ డిమాండ్లపై కేంద్రీకరించే వారు. ఆ డిమాండ్లను పునశ్చరణ చేసేందుకు మాత్రమే మేడేని అంకితం చేసేవారు. మిలిటెంట్ సాంప్రదాయాన్ని, వర్గపోరాటాన్ని, తలెత్తుతున్న ఫాసిస్టు శక్తులతో పోరాడే తత్వాన్ని ముందుకు తీసుకుపోయే బాధ్యత కమ్యూనిస్టులపైన, మిలిటెంట్ కార్మికవర్గంపైనా పడింది. జర్మనీలోని కమ్యూనిస్టు పార్టీ కార్మికవర్గంలోని మిలిటెంట్ సెక్షన్లు ఫాసిస్టు వ్యతిరేకపోరాటంతో కీర్తి సాధించుకున్నారు. ఫ్రెంచి, బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ల సంస్కరణవాద నాయకులు హిట్లర్ ఫాసిజానికి వ్యతిరేకంగానే సమిష్టి పోరాటంలో పాల్గొనలేదు. తమ తమ సామ్రాజ్యవాద ప్రభుత్వాలు సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా సాగించే అసహ్యకరమైన అంతర్జాతీయ కుట్రలకు తోడ్పడసాగారు. ఈ కాలంలో అమెరికాలోని ట్రేడ్ యూనియన్ ఉద్యమం మిలాఖత్‌దార్ల రౌడీ గుంపుల ఆధ్వర్యాన చేరింది. మేనేజ్‌మెంట్లతో షరీకై కృషి చేయసాగారు

వారు. (ఏడాది కేడాది పాత కాలపు అంతర్జాతీయ దృక్పథం, మిలిటెంట్‌ల గొంతు నులిమేశారు).

దీని ఫలితంగానే యూరోప్, అమెరికాల కార్మికవర్గం రెండవ ప్రపంచయుద్ధ కాలంలో చాలా వరకు తమకు అనువైన పాత్ర వహించలేదు. ఎక్కువ సందర్భాలలో సోవియట్ వ్యతిరేక కుట్రలలో సామ్రాజ్యవాదానికి, సహకరించారు. అయితే ఈ సమయానికి ఆసియా, తదితర ఖండాలలోని అనేక దేశాలలో కార్మికవర్గ తత్వము, సోషలిస్టు విప్లవ చైతన్యం వ్యాపించాయి. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటకాలంలో ఈ దేశాలలో మేడే విప్లవ సాంప్రదాయాలు సజీవంగా నిలిచాయి. ఫలితంగా ప్రపంచంలోనే అతి పెద్దదైన చైనా విప్లవం విజయ పతాకను ఎగురవేసింది. ఆ తరువాత కొరియా, వియత్నాంలో విప్లవాలు విజయవంతమైనాయి. విజయవంతమైన ఎర్రసేన ప్రత్యక్ష ప్రభావంతో తూర్పు యూరోప్ రాజ్యాలలో సోషలిస్టు విప్లవం విజయవంతమైంది.

సోవియట్ కార్మికవర్గము, ప్రజలు 1945 మేడే ని ఘనంగా జరుపుకున్నారు. దాని చారిత్రక ప్రాధాన్యతలో ఏదీ మీరజాలదు. అదొక విశిష్ట వైభవంతో సాగింది.

సోవియట్ సుప్రీం కమాండర్ ఇన్ చీఫ్ స్టాలిన్ ఆనాటి తన ఉపన్యాసంలో ఇలా అన్నారు సోవియట్ శ్రామిక ప్రజలారా! మన దేశం ఈనాడు మేడే జరుపుకుంటున్నాం. ఇది కార్మికవర్గ అంతర్జాతీయ పండుగ.

“మహత్తర దేశభక్త యుద్ధం విజయవంతంగా పూర్తి అవుతున్న సందర్భంలో మన మాతృభూమి. మన ప్రజలు ఈ ఏడు మేడేని జరుపుకుంటున్నారు.

“మాస్కో, లెనిన్ గ్రాడ్, గ్రోడ్నీ, స్టాలిన్ గ్రాడ్‌ల ముంగిట శత్రుదాడులను తిప్పికొడుతున్న దుర్భర దినాలు పోయాయి. అవి ఇక తలెత్తవు. జర్మనీ గడ్డపై శత్రుసైన్యాలను మన విజయసైన్యం నాశనం చేస్తున్నది. బెర్లిన్ దాటారు ఎల్బేనదిని అధిగమించి ఈ శత్రువినాశన కార్యక్రమం సాగిస్తున్నారు. హిట్లర్ జర్మనీ పతనం ఇకరోజుల్లోకి వచ్చింది.”

ముందు కాలపు వర్గ సాంప్రదాయం, అంతర్జాతీయతా సౌహార్దతలు ఎక్కడైతే నిలబెట్టబడ్డాయో అక్కడే కార్మికవర్గం అతివేగంగా పురోగమించిందని స్పష్టమవుతూనే ఉంది. ఇతర దేశాలలో సంస్కరణ వాద నాయకులు దానికి ద్రోహం చేశారు. సామూహిక

హత్యలు, ఉరితీతలు, చిత్రహింసలు సాగినాకార్మిక వర్గం అపూర్వమైన విజయాలను సాధించింది.

## భారతదేశంలో మేడే

మన దేశంలో కార్మిక వర్గం డెబ్బై ఏళ్ళకు పైగా మేడే జరుపుతున్నది. వాస్తవంలో 1862లోనే హౌరా రైల్వే కార్మికులు ఎనిమిది గంటల పనిని డిమాండ్ చేశారు. మొదటి అంతర్జాతీయ సంస్థతో సంబంధాలు ఏర్పర్చుకునేందుకు బెంగాల్ నుండి ప్రయత్నాలు సహితం సాగాయి. ఆ సంస్థకు రాసిన లేఖ ఒక దానిని అంతర్జాతీయ కార్మిక సంస్థ మినిట్స్‌లో పేర్కొన్నారు. అయితే ట్రేడ్ యూనియన్లు మన దేశంలో ఏర్పడిన నాటి నుండి గూడా మేడే నిర్వహణను ఐక్యంగా చేపట్టడంగాని, నిర్వహించేందుకు ఆమోదించడం గాని జరుగలేదు. గడచిన శతాబ్దం 20, 30 సంవత్సరాలలో కమ్యూనిస్టులు మినహా మరెవ్వరూ, నకృతుగా తప్ప, మేడే జరిపే వారు కాదు. ఆ తరువాత కాలంలో మేడే నిర్వహణకు పూనుకున్న కమ్యూనిస్టేతరులు రెండవ ఇంటర్నేషనల్ ప్రభావంతో అందుకు పూనుకున్నారు. బ్రిటన్‌లోని సంస్కరణవాద ట్రేడ్ యూనియన్ ఉద్యమ ప్రభావం వుండేది వారి మీద. అనేక మంది ట్రేడ్ యూనియన్ నాయకులు మేడే అనేది ఏదో ఒక విదేశీ విషయంగా భావించేవారు. కార్మిక వర్గ అంతర్జాతీయ ఐక్యతాదినంగా దానిని అంగీకరించేవారే కాదు. ఒక వర్గంగా కార్మిక వర్గాన్ని గురించిన దృక్పథం వారికి లేకపోవడమే అందుకు కారణం. అంతర్జాతీయ ఐక్యత అవసరాన్నే వారు పట్టించుకోలేదు. ఈనాటికీ మేడే మన ఉద్యమంలోకి చొరబారిన విదేశీ అంశంగా భావించే ట్రేడ్ యూనియన్ సంస్థలు మన దేశంలో లేకుండా పోలేదు.

మేడే యొక్క అంతర్జాతీయతా భావంతో, పెట్టుబడిదారీ విధానాన్ని తుద ముట్టించడమనే లక్ష్యంతో ట్రేడ్ యూనియన్ ఉద్యమం సమిష్టిగా మేడే జరపలేక పోయింది. ఇందుకు కారణం పశ్చిమ దేశాల వుద్యమానికి వుండే రుగ్మతలే. ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో ఒక భాగపు నాయకత్వం సోషలిజం అని పేరెత్తడానికే యిష్టపడదు. ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో రాజకీయాల పేరెత్తేందుకే అది వ్యతిరేకం. వీరు స్పష్టంగా సమ్మె వ్యతిరేకులు. ఇలాంటి నాయకుల మద్దతుతోనే బ్రిటిష్ ప్రభుత్వం ప్రజలను అవివేకంలో ముంచెత్తింది. బ్రిటిష్ వారితో వారి మిలాఖత్‌తనాన్ని

వ్యతిరేకించగానే 1929 లో వారు ఏ.ఐ.టి.యు సి.ని విచ్ఛిన్నం చేశారు. సామ్రాజ్యవాద వ్యతిరేక రాజకీయ పోరాటాన్ని నిరాకరిస్తూనే, ఆ ప్రాతిపదికపైనే ఐక్యత ఏర్పడాలని వారు కోరారు. ట్రేడ్ యూనియన్లు అన్ని రాజకీయాలను నిరాకరించాలని, సమ్మెలను నివారించాలని వారి షరతు. ఆ షరతులను అంగీకరిస్తేనే ఐక్యత అనేవారు.

అందువల్లనే ఇలాంటి వారితో కలిసి సమిష్టిగా మేడే జరపడం ఎందుకు అసాధ్యమయ్యేదో సులభంగా అర్థం చేసుకోవచ్చు.

## బూర్జువా జాతీయవాదం అంతర్జాతీయత

జాతీయ వాదులతోనూ ఏ మాత్రం సౌలభ్యంగా వుండేది కాదు పరిస్థితి. జాతీయ వాదులలో ఒక భాగం కార్మిక వర్గంలో స్వతంత్ర్యమైన రాజకీయాలు ప్రవేశపెట్టేందుకు వ్యతిరేకించింది. వాస్తవం..లో కార్మికోద్యమంలో ఎలాంటి రాజకీయాలకైనా వారు వ్యతిరేకులే. వారిలో పాతుకుపోయిన జాతీయవాద దృక్పథం అంతర్జాతీయ భావంతో ఆలోచించేందుకు వారికి అవరోధమైంది. సోషలిజాన్ని గురించి అసలే ఆలోచించగలిగే వారు కాదు. వాస్తవంలో అంతర్జాతీయతకు వ్యతిరేకం. జాతీయవాదాన్ని, దేశభక్తిని పోటిగా నిలిపేవారు. విదేశీ భావాలపై ఆధారపడుతున్నారని కమ్యూనిస్టులపై ఆరోపణలుచేసేవారు. అయితే జాతీయోద్యమంలోని తీవ్రవాద విభాగం మాత్రం స్వాతంత్ర్యం స్వేచ్ఛా వంటి సమస్యను కార్మికవర్గం ముందు వుంచేందుకు సిద్ధమే. సామ్రాజ్యవాద వ్యతిరేక కార్యాచరణకు సహితం కార్మిక వర్గానికి పిలుపునిచ్చేందుకు సంసిద్ధులే. అయితే అంతర్జాతీయతకు మాత్రం వ్యతిరేకులు. ఈ తీవ్ర వాదులలో అనేకులు అతి త్వరలోనే సోవియట్ వ్యతిరేక వైఖరిని పెంపొందించుకున్నారు.

అందువల్ల ఆ కాలంలో మేడే మౌలిక పిలుపు ప్రాతిపదికగా ఏ విభాగంతోనైనా కలసి మేడే జరపడం సాధ్యపడేది కాదు. అందువల్లనే ఎక్కువసార్లు ఒంటరిగానే మేడే జరపక తప్పేది గాదు కమ్యూనిస్టులకు. కొన్ని సందర్భాలలో ఐక్యతా ప్రయోజనాల దృష్ట్యా కాంగ్రెస్ సోషలిస్టుల వంటి తీవ్రవాద జాతీయ వాదులతో కలసి మేడే జరిపేవారం. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం పోరాడమని కార్మిక వర్గానికి పిలుపు యిచ్చేవారం. కాని అంతర్జాతీయ సౌహార్థత, ఐక్యతలకు అలాంటి సభలలో పిలుపు యివ్వడం చాలా బలహీనంగా వుండేది.

## విప్లవ సాంప్రదాయాలతో నిలిచిన కమ్యూనిస్టులు

అయితే కమ్యూనిస్టులు, వారి ప్రభావంలో వుండే ట్రేడ్ యూనియన్లు మాత్రం తమ అనుచరులలో మేడే అంతర్జాతీయతా భావాన్ని చొప్పించగలిగారు. రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైనప్పుడు యుద్ధ వ్యతిరేక మొదటి ప్రదర్శన జరిపింది కమ్యూనిస్టులే. యుద్ధ ప్రకటన జరిగిన కొద్ది రోజులకే బొంబాయిలో 1939 అక్టోబరు రెండవ తేదీన పెద్ద ప్రదర్శన నిర్వహించారు. ఆనాడు యుద్ధ వ్యతిరేక సమ్మెలో 90 వేల మంది కార్మికులు పాల్గొన్నారు. ప్రపంచ కార్మికోద్యమంలోనే రెండవ ప్రపంచ యుద్ధకాలంలో జరిగిన మొదటి యుద్ధ వ్యతిరేక ప్రదర్శన అది. ఆనాటి బహిరంగ సభలో ఆమోదించిన తీర్మానంలో ఇలా వుంది. “ఈ సమావేశం అంతర్జాతీయ కార్మిక వర్గంతో, సామ్రాజ్యవాదులచే వినాశకర యుద్ధంలోకి లాగబడుతున్న ప్రపంచ ప్రజలతో తన సౌహార్థతకు వ్యక్తం చేస్తున్నది. ఈ యుద్ధం అంతర్జాతీయ కార్మిక వర్గ సౌహార్థతకు సవాలుగా ఈ సమావేశం భావిస్తున్నది. మానవతకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాదులు సాగిస్తున్న ఈ కుట్రను ఓడించడం వివిధ దేశాల ప్రజల, కార్మికుల కర్తవ్యమని ఈ సభ ప్రకటిస్తున్నది.”

ప్రజలపై మోపిన యుద్ధ భారాలకు వ్యతిరేకంగా ప్రతిఘటన మొదట ప్రారంభించింది కమ్యూనిస్టులే 1940 మార్చి ఒకటవ తేదీన కరువు బత్తెం కోసం 75 వేల మంది జౌళి కార్మికులు పాల్గొన్న బొంబాయి సమ్మెతో ఈ ప్రతిఘటన ప్రారంభమైంది. బొంబాయి సమ్మెతో దేశమంతా సమ్మె పోరాటాల వెల్లువ ముంచెత్తింది.

స్వాతంత్ర్యానంతరం జాతీయ కాంగ్రెస్ ఆధిపత్యాన గల ట్రేడ్ యూనియన్ విభాగం ఏ.ఐ.టి.యు సి నుండి వేరుపడిపోయింది. ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో కమ్యూనిస్టులతో కలసి వుండేందుకు తాము సిద్ధంగా లేమని స్పష్టం చేశారు. కార్మిక వర్గాన్ని బూర్జువా వర్గ ప్రభావంలోనే వుంచేందుకు పన్నిన బహిరంగ ఎత్తుగడ ఇది. అంతర్జాతీయతను నిరాకరించి కార్మిక వర్గంలో వర్గ సామరస్య రాజకీయాలను చొప్పించే బహిరంగ ప్రయత్నం. ఇందుకోసమే ఐ.ఎన్.టి.యు.సి.ని ఏర్పర్చారు.

ఆ తర్వాత ఎఐటియుసి నాయకత్వంలో కొంత భాగం వర్గ సంకర విధానాలను అనుసరించడంతో, దానికి వ్యతిరేకంగా నికరమైన కార్మిక వర్గ పంథాను నిలబెట్టడానికి మరొక విభాగం తీవ్రంగా ప్రయత్నించింది. వర్గ సంకర విధానాలను ప్రతిఘటిస్తూనే

ఎఐటియుసిని ఐక్యంగా నిలబెట్టడానికి తన శాయశక్తులా కృషిచేసింది. అయినా ఫలితం లేకపోవడంతో చివరికి 1969లో సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్‌యూనియన్స్ (సిఐటియు) పేరుతో మరొక సంస్థను ఏర్పాటు చేసింది. ఈ కాలంలో ట్రేడ్ యూనియన్ హక్కుల పరిరక్షణ కోసం, ప్రపంచీకరణ, నయా ఉదారవాద ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగాను, దేశ ఆర్థిక సార్వభౌమత్వానికి మద్దతు గాను జరిగిన అన్ని పోరాటాలలోను సిఐటియు అగ్రస్థానంలో నిలబడి ముందుకు సాగుతున్నది.

## సామ్రాజ్యవాద ప్రపంచీకరణ నేపథ్యంలో...

నేడు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ నిజ స్వరూపం మున్నెన్నడూ లేనంత స్పష్టంగా వ్యక్తమవుతున్నది. దాని ఫలితంగా ప్రపంచంలో అసమానతలు తీవ్ర స్థాయికి చేరాయి. ప్రపంచంలో సంపద ఒక వైపున గుట్టలు పడుతుంటే, పేదరికం మరొకవైపున పేరుకు పోతున్నది. తాజాగా అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం ప్రపంచంలోని 1 శాతం అతి సంపన్నుల చేతిలో 40 శాతం ఉత్పత్తి కేంద్రీకృతం అవుతుండగా, 50 శాతం ప్రజలు కేవలం 1 శాతం ప్రపంచ ఉత్పత్తితో పేదరికంలో మగ్గిపోతున్నాయి. భారతదేశంలో సైతం 100 కోట్ల డాలర్లను మించి ఆస్తులు కలిగిన అతి సంపన్నులు 30 శాతం జాతీయాదాయాన్ని అనుభవిస్తుండగా, 40 శాతం బాలలు పౌష్టికాహారలోపంతో బాధపడుతున్నారు. ఫార్చ్యూన్ మ్యాగజైన్ ప్రకారం నేడు ప్రపంచంలోని 10 మంది అతి సంపన్నుల్లో నలుగురు భారతదేశంలోనే ఉన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. జపాన్‌కు చెందిన వారు కేవలం ఇద్దరు మాత్రమే.

ఇదే సమయంలో దేశ ఆర్థిక సార్వభౌమత్వ పరిరక్షణలో కీలక పాత్ర వహించే ప్రభుత్వ రంగం అంతకంతకు ధ్వంసం చేయబడుతున్నది. విచక్షణా రహితంగా దేశ, విదేశీ ప్రైవేటు సంస్థలు అనుమతించబడుతున్నాయి. మరో వైపున ట్రేడ్ యూనియన్ హక్కుల మీద తీవ్రమైన దాడి జరుగుతున్నది. మొత్తం లేబర్ చట్టాలను మార్చే కుట్ర జరుగుతున్నది. ప్రపంచం అంతా ఒక కుగ్రామంగా మారింది అన్న పేరుతో కార్మికుల శెలవు రోజులకు మంగళం పాడే ప్రయత్నాలు జరుగుతున్నాయి. పని భారం విపరీతంగా పెరుగుతున్నది. పని గంటలనూ పెంచడానికి పూనుకుంటున్నారు. సాక్షాత్తూ ఆర్థిక మంత్రే 10 గంటల పనిదినం గురించి మాట్లాడుతున్నారు. అసంఘటితరంగం, కాజువల్

కార్మికులు పెద్ద ఎత్తున పెరుగుతున్నారు. దానితో పాటే దోపిడీ కూడ అనూహ్యమైన స్థాయిలో పెరుగుతున్నది. ఇలాంటి క్లిష్ట సమయంలో మొత్తం కార్మిక వర్గం అంతా ఒక్కటిగా ఇతర శ్రమజీవులు, ప్రజాతంత్ర శక్తులతో కలిసి సామ్రాజ్యవాదాన్ని, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదాన్ని, దాని కుట్రలను ప్రతిఘటించాలి. ప్రపంచీకరణను, నయాఉదారవాద విధానాలను తీవ్రంగా ఎదుర్కొనాలి.

మరోవైపున మతోన్మాద శక్తులు విజృంభించి ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నాయి. మౌలికమైన లౌకిక, ప్రజాతంత్ర విలువలనే మట్టుపెట్టచూస్తున్నాయి. మత విద్వేషాలను రెచ్చగొట్టి తమ పబ్బం గడుపుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. ఇలాంటి ప్రమాదకరమైన మతోన్మాద శక్తులను ప్రతిఘటించి, ఓడించాల్సిన బాధ్యత కూడా కార్మికవర్గం, ఇతర శ్రామికుల మీద ఉంది. ఈ పరిస్థితిలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవమైన మేడే మరింత ప్రాధాన్యత సంతరించుకున్నది.